ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 25.0

నేడు డీఎస్సీ సెలెక్టెడ్ అభ్యర్థులకు కాల్‌లెటర్లు

13 మంది విద్యార్థినులకు టైఫాయిడ్

■ లోపలి పేజీలో..

అక్షర విజయం

నూజివీడు పట్టణ వాసులను ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం దొరికింది.. వారికి 'అక్షరం' ఆయుధంగా మారింది. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' వారి గొంతుకగా మారి పాలకులు, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లింది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా' పేరిట వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' జనవరి 28వ తేదీన నూజివీడు పట్టణంలోని ప్రజా సమస్యలపై మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన సదస్సును నిర్వహించింది. ఈ సదస్సులో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని తాము ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు సమస్యలు విన్నారు. ఇవన్నీ స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి వెళ్లగా ఒక్కొక్కటిగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో నూజివీడు సంగం కాంప్లెక్స్‌లో సోమవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజల సమక్షంలో సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది.

- 'ఆంధ్రజ్యోతి' 'అక్షరం అండగా పరిష్కారమే అజెండా'గా సమస్యల పరిష్కారం
- నూజివీడులో సుమారు రూ. పది కోట్లతో అభివృద్ధి పనులు
- పట్టణంలో నాయకులు, ప్రజల సమక్షంలో 'ఆంధ్రజ్యోతి' సక్సెస్ మీట్
- సామాజిక బాధ్యత కలిగిన పత్రిక ఆంధ్రజ్యోతి : చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ

■ లోపలి పేజీలో..



'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా' సక్సెస్‌మీట్‌లో మాట్లాడుతున్న నూజివీడు మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ. చిత్రంలో వైస్‌చైర్మన్ పగడాల సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ నాయకుడు నూతక్కి వేణు గోపాలరావు , బీజేపీ పట్టణ అధ్యక్షురాలు నాగరాణి, ఆంధ్రజ్యోతి బీఎం హరిబాబు, ఎడిషన్ ఇన్‌చార్జి రామకృష్ణ





సమావేశానికి హాజరైన ప్రజలు

సామాజిక బాధ్యత కలిగిన 'ఆంధ్రజ్యోతి'..

సామాజిక బాధ్యత కలిగిన పత్రిక 'ఆంధ్రజ్యోతి'. ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేసేలా తన వంతు పాత్రను పోషిస్తోంది. పట్టణంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా' సదస్సులో ప్రజలు మా దృష్టికి తెచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

- రామిశెట్టి త్రివేణిదుర్గ, మునిసిపల్ చైర్‌పర్సన్



దూకుడు

జీఎస్టీ వసూళ్లలో ఐదు శాతం పురోగతి



ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వస్తు సేవల పన్ను(జీఎస్టీ)లు వసూళ్లపై రాష్ట్ర ఉన్నతా ధికారుల నిరంతర పర్యవేక్షణతో వసూళ్లు పురోగతి బాట పడుతున్నాయి. కేంద్రానికి, రాష్ట్రాలకు ఈ పన్నే కీలక ఆధారం కావడం తో వివిధ సంస్కరణలను వాణిజ్యపన్నుల శాఖ అమలు చేస్తోంది. దీంతో గత నాలుగు నెలలు కాలానికి జీఎస్టీ వసూళ్లల్లో ఐదు శాతం పురోగతిని జిల్లా యంత్రాంగం సాధించింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలు, ఆక్వా, ఐరన్, రైస్‌మిల్లు, హార్డ్‌వేర్, ఇతర పరిశ్రమలు, ఆంధ్రా షుగర్స్ తదితర సంస్థల ద్వారా జీఎస్టీ వసూళ్లు జరుగుతుంటాయి. ఏడు సర్కిళ్లతో పాటు, 100 మంది ప్రధాన వ్యాపార డీలర్లతో మరో స్పెషల్ సర్కిల్‌తో కలిపి 2023-24కు రూ.649 కోట్ల ఆదాయానికి గాను రూ.453.43 కోట్లు, గడిచిన 2024-25 ఆర్థిక సంవత్స రంలో రూ.468.88 కోట్ల ఆదాయం సమకూరింది. ఆదా యం వసూళ్ల లక్ష్యాలు భారీగా పెరగడంతో వసూళ్ల స్థాయిని అందుకోలేని కారణంగా నెలల వారీగా లక్ష్యాలను విధించినట్లు తెలుస్తోంది. ఈ ఆర్థిక సంవత్స రంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.191 కోట్ల లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.201 కోట్ల ఆదాయాన్ని వాణిజ్య పన్నుల శాఖాధికారులు సాధించారు. సగ టున 5 శాతం వసూళ్ల వృద్ధిరేటును సాధించారు. దీంతో రూ.10 కోట్ల అదనంగా వసూళ్లు చేశారు. మొత్తంగా 15,856 మంది స్టేట్ యాక్టివ్ టాక్స్ పేయర్స్‌గా, 11,005 మంది సెంట్రల్ యాక్టివ్ టాక్స్ పేయర్స్‌గా ఉన్నట్టు వాణిజ్య పన్నుశాఖ అధికారులు లెక్కలు చెబుతున్నాయి.

మొండి బకాయిలపై కొరడా

వాస్తవంగా 5,12,18,28 శాతం జీఎస్టీ స్లాబ్‌లు ఉంటాయి. వీటిలో అధికంగా పన్ను వసూలయ్యే 18, 28 శాతం స్లాబ్‌లో ఎక్కువగా పన్ను ఎగవేత జరుగుతోంది. సిమెంట్, ఐరన్, ఎలక్ట్రానిక్ గూడ్స్, కంప్యూటర్లు, బ్యాటరీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు, సిగిరెట్లు తదితరాలు వీటి పరిధిలోకి వస్తాయి. ఎక్కువ మొత్తంలో జీఎస్టీ పనుల్నా చెల్లించాల్సి ఉండడంతో వ్యాపారులు, సరుకు రవాణాదారులు అక్రమాలకు పాల్పడుతుంటారు. 50 లక్షల విలువైన సరుకు రవాణా చేస్తూ 10 లక్షల నుంచి 20 లక్షల సరుకుకే పన్ను చెల్లిస్తారు. వీటిపై జిల్లా అధికారులు రెవెన్యూ రికవరీ యాక్టును ప్రయోగిస్తున్నారు. 2017 జీఎస్టీ అమలు ప్రారంభమైన అప్పటి నుంచి ఇప్పటి వరకు 853 మంది జీఎస్టీ కింద 90కోట్ల70 లక్షలు మొండి బకాయిలను చెల్లించాల్సి ఉంది. బ్యాంకులు, స్థానిక మున్సిపాల్టీల, పంచాయతీల సహకారంతో వారి ఆస్తులను గుర్తించి వారి నుంచి రికవరీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.2.50 కోట్లు బకాయిలను రికవరీ చేశారు. వ్యాపారులు కూడా మేము అంత కట్టనవసరం లేదని అప్పీళ్లకు వెళ్లడం, కోర్టులను ఆశ్రయించడంతో రావాల్సిన బకాయిలు పెండింగ్‌లోకి వెళుతున్నట్టు చెబుతున్నారు.

- మొండి బకాయిలపై ఆర్‌ఆర్ యాక్టు ..
- ఉమ్మడి జిల్లాలో రూ.90.70 కోట్లు బకాయిలు
- అన్నిశాఖల సమన్వయంతోనే వసూళ్లు సాధన : జాయింట్ కమిషనర్

● కలెక్టర్ సమీక్షలూ దోహదం..

జీఎస్టీ వసూళ్ల పురోగతిపై కలెక్టర్ ఇటీవల సమీక్షలు జరపాలన్న ఆదేశాలతో ఈ శాఖలో ఆదాయాల పురోగతి బాటన పడుతున్నాయి. మొండి బకాయిల వసూళ్లకు స్థానికంగా మున్సిపాల్టీలు, రెవెన్యూ, పంచాయతీరాజ్, బ్యాంకులతో పాటు వివిధ వర్తక సంఘాలతో ఏర్పాటు చేసిన అడ్వైజరీ కమిటీలతో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు ముందడుగు వేస్తున్నారు. వే-బిల్లులు లేకుండా సరుకులను తరలించకుండా ఉండేందుకు నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో సిద్ధాంతం బ్రిడ్జి, అలంపురం, ఉంగుటూరు, గుండుగొలను, కలపర్రు హైవేలతో పాటు, తెలంగాణ నుంచి వివిధ వస్తువులు ఏలూరు జిల్లా మీద నుంచి దాటిపోకుండా జీలుగుమిల్లి, నూజివీడు, కొయ్యలగూడెం, భీమవరం, కైకలూరు ప్రాంతాల్లో నోడల్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు.

ఎవరిని ఉపేక్షించం ..



ఉమ్మడి పశ్చిమ జిల్లాలో జీఎస్టీ ఎగవేతదారులందరికి నోటీసులు జారీ చేశాం. ఎవరిని ఊపేక్షించేది లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ శాఖల సమన్వయంతో వారితో ఆయా బకాయిలను కట్టించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ ,ఆర్‌అండ్‌బీ శాఖల కాంట్రాక్టులను చేసి పన్ను ఎగవేసే కాంట్రాక్టర్ల వివరాలను సేకరిస్తున్నాం. త్వరలో వారిపైన చర్యలుంటాయి. పన్నుఎగవేత దారుల సమాచారం కోసం అవుట్ రీచ్ కార్యక్రమం ప్రారంభించాం. ఎక్కడైనా అనధికారికంగా కోట్లలో వ్యాపారాలు చేసే వారి వివరాలను సామాన్యులు, చుట్టు పక్కల వారు మాకు సమాచారం ఇచ్చేందుకు వాట్సాప్ నంబర్‌ను 87126 31283ను ప్రవేశపెట్టాం. వివిధ సంఘాలతో మూడు నెలలకొకమారు అడ్వైజరీ కమిటీ సమావేశాలను నిర్వహించి జీఎస్టీ వసూళ్ల వేగంగా సాధించడానికి వారి సహకారం తీసుకుంటున్నాం.

- డాక్టర్ బి.నాగార్జునరావు, జాయింట్ కమిషనర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

అర్జీలు రీ-ఓపెన్‌కు ఆస్కారం ఇవ్వొద్దు

- కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని, నిష్పక్షపాతంగా పనిచేసి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించారు. ఆమెతో పాటు జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, ఎస్‌డీసీ భాస్కర్, జడ్పీ సీఈవో శ్రీహరి, డీఆర్డీఏ పీడీ విజయరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, సర్వే సహాయ సంచాలకులు అన్సారీ, నగర పాలక కార్పొరేషన్ కమిషనరు భానుప్రతాప్ పాల్గొని మొత్తం 441 అర్జీలను స్వీకరించారు.



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

పారదర్శకంగా న్యాయం చేస్తాం : ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఫిర్యాదును క్షేత్ర స్థాయిలో దర్యాప్తు చేసి పారదర్శకంగా చట్ట ప్రకారం న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ హామీ ఇచ్చారు. ప్రతి సోమ వారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీతో పాటు ఏఎస్పీ సూర్యచంద్రరావు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుమూలల నుంచి వచ్చిన 49 మంది ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు అప్పటికప్పుడే ఫోన్‌లో జారీ చేశారు. ప్రజలు తమ సమస్యలపై సమీపంలో ఉన్న సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో కూడా ఫిర్యాదు చేయవచ్చని లేదంటే వెబ్‌సైట్ https://meekosam.ap.gov.inలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రతి ఫిర్యాదు ఫిర్యాదు స్థితి గతులను తెలుసుకోవాలంటే 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని సూచించారు.

ఎట్టకేలకు మూడు దరఖాస్తులు

- నేటితో ముగియనున్న బార్ దరఖాస్తుల గడువు
- చివరిరోజు స్పందన ఉంటుందంటున్న అధికారులు

ఏలూరు, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్‌లకు లైసెన్సులకు దరఖాస్తుదారుల నుంచి ఆశించిన స్పందన లేకపోవడం ఎక్సైజ్‌శాఖలో గుబులు రేగుతోంది. జిల్లాలో 18 బార్లకు నోటిఫికేషన్‌ను ఈనెల 18న జారీ చేశారు. సరిగ్గా వారం గడిచిన తర్వాత కేవలం మూడే దరఖాస్తులను సోమవారం దాఖలయ్యాయి. అందులో ఏలూరు నుంచి రెండు, నూజివీడు నుంచి ఒక్కటి దాఖలయ్యాయి. సిండికేట్ వ్యవస్థను చేధించేందుకు వీలుగా కనీసం నాలుగు దరఖాస్తుల వస్తేనే లాటరీ తీస్తామన్న నిబంధన దరఖాస్తు దారుల్లో కొంత వెనుకడుగుకు కారణంగా చెబుతున్నారు. దరఖాస్తుతో పాటు నాన్ రిఫండ్‌బుల్ మొత్తాన్ని టీడీపీ ప్రభుత్వం రూ.10 లక్షల నుంచి రూ.5 లక్షలకు తగ్గించిన విషయాన్ని, లాటరీలో దక్కించుకున్న లైసెన్సుకు ఆరు విడతలుగా ఫీజు చెల్లింపు సులభతరం వంటి అంశాలను ఎక్సైజ్‌శాఖ అధికారులు ఔత్సాహికులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలుస్తోంది. చివరి రోజు ఈనెల 26న సాయంత్రం భారీ సంఖ్యలో దరఖాస్తులు పోటెత్తు తాయన్న ధీమా వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉండగా ఏలూరు, నూజివీడుల్లో కల్లుగీత కార్మికులకు కేటాయించిన రెండు బార్ల లైసెన్సులకు ఈ నెల 29వ తేదీతో గడువు ముగియనుంది. మంగళవారం దరఖాస్తుదారుల స్పందన బట్టి లాటరీ తీస్తామని అధికారులు చెబుతున్నారు.



నేత్రదాన పక్షోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, డీఎంహెచ్‌వో అమృతం

నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం కల్పించండి

- కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో నేత్రదానంపై ప్రజల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కరపత్రాలను ఆమె మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారానికి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్నియాల అవసరం రోజు రోజుకు పెరుగుతోందని, వీటిని సేకరించేందుకు ఈనెల 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాల్లో వివరించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జాన్ అమృతం, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.మల్లిఖార్జున రాజు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం ఎటువైపు ?

- జిల్లాల పునర్విభజన కమిటీ నియామకంతో తెరపైకి
- గణపవరం మళ్లీ ఏలూరులో విలీనం కానుందంటూ చర్చ
- ప్రజాభిప్రాయం మేరకు గతంలో పశ్చిమలో చేరుస్తూ గెజిట్
- భీమవరంలోని కలెక్టరేట్ వద్ద గణపవరం నాయకుల ధర్నా



భీమవరంలోని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందిస్తున్న గణపవరం మండల అఖిలపక్ష నేతలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో జిల్లాల ఏర్పాటు అశాస్త్రీ యంగా జరిగిందన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని వేసింది. దాంతో పశ్చిమ జిల్లా స్వరూపంపై మళ్లీ చర్చ సాగుతోంది. గత ప్రభుత్వం పార్లమెంట్ స్థానం పరిధి ఆధారంగా జిల్లాలను ఏర్పాటు చేసింది. భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లాను ఏర్పాటు చేశారు. ఉంగుటూరు నియోకవర్గంలోని గణపవరం మండలం ఏలూరుకు దూరంగా ఉంటోందన్న ఉద్దేశంతో పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేయాలంటూ స్థానిక ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాలు ఏలూరు జిల్లాకు వెళ్లినా స్థానిక డిమాండ్ మేరకు గత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గణపవరం మండలాన్ని ప్రత్యేకంగా పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేసింది. భీమవరం రెవెన్యూ డివిజన్‌లో కలిపింది.జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణానికి గణపవరం మండల గ్రామాలు దగ్గరగా ఉంటాయన్న ఉద్దేశంతో స్థానిక ప్రజలు పశ్చిమలో చేర్చాలంటూ డిమాండ్ చేశారు. భీమవరంలో చేర్చిన తర్వాత పాలన అంతా ఇక్కడ నుంచే సాగుతోంది. మళ్లీ పునర్విభజన చేయడానికి కూటమి ప్రభుత్వం కమిటీ వేయడంతో గణపవరం మళ్లీ ఏలూరు జిల్లాలో కలిసిపోతుందన్న ఊహాగానాలు ప్రారంభమయ్యాయి. ఆ దిశగా కూటమినేతలు ప్రతిపాదన చేసినట్టు తెలుస్తోంది.

గణపవరం మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద గణపవరం మండలంలోని అఖిలపక్ష నాయకులు, గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలుపవద్దని అఖిలపక్ష నేతలు జిల్లా కలెక్టర్ కార్యా లయంలో వినతిపత్రం అందజేశారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

ఏలూరు,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించి పెద్దమొత్తంలో ఎరువులను సోమవారం సీజ్ చేశారు. ఏలూరులో రామాంజనేయ మెన్యూర్ కంపెనీ, రాఘవేంద్ర, పెంటపాడు మండలంలో ప్రత్తిపాడు, ఆచంటకు చెందిన శ్రీనివాస మెన్యూర్,పోడూరు మండలంలో పెనుమదంలో అయ్యప్ప ఫెర్టిలైజర్స్, రైతు డిపో, నిడదవోలులో వెంకటేశ్వర మెన్యూర్ డిపోల్లో తనిఖీలు చేపట్టారు. ఇందులో రామాంజనేయ, శ్రీనివాస,అయ్యప్ప దుకాణాల్లో జీరో ఫారం లేనందున 9లక్షల72వేల 532 రూపాయల విలువైన 51.225 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. నూజివీడు మండలం రమణక్కపేటలో భార్గవి ఎంటర్ ప్రైజెస్,గణపవరంలో ధనలక్ష్మి ఫెర్టిలైజర్స్, సత్యనారాయణ మెన్యూర్ డిపో, గణపవరం పులవర్తి ఫెర్టిలైజర్స్, గణపవరం మురళీ కృష్ణ ట్రేడర్స్ ,గాదే రామలింగేశ్వరరావు డిపోలను తనిఖీ చేయగా, ఇందులో సత్యనారాయణ డిపో, రామలింగేశ్వరావు కంపెనీల్లో జీరో ఫారం లేకుండా 17లక్షల34వేల విలువైన 73.200 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. సత్యనారాయణ మెన్యూర్ డిపో, పులవర్తి ఫెర్టిలైజర్స్‌లో 9లక్షల 16వేల 792విలువైన 56వేల095 టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించి కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు


వినాయకుని ఆకారంలో ఫైకాన్ మొక్కలు

మొక్కల గణపతి

తణుకు రూరల్, అగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆకులో ఆకునై.. పువ్వులో పువ్వునై.. అని ఒక సినిమా గేయ రచయిత చెప్పినట్లు విఘ్నాలకు అధిపతైన గణపతిని కూడా మొక్కలతో మలిచారు. తణుకు రూరల్ మండలం వేల్పూరులో మెయిన్ రోడ్డు పక్కన నూనె వెంకటరావు ఇంటి ముందు అలంకరణ కోసం పెంచే ఫైకాన్ మొక్కలను వినాయకుని ఆకారంలో కట్ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వినాయకుని ఆకారంలో మొక్కలను పెంచడం ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.


శివలింగం ఆకారంలో వినాయక లడ్డూ

శివ ప్రసాదం

నరసాపురం టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలకు రాయల్ బేకరీలో శివలింగం ఆకారంలో లడ్డూ ప్రసాదం తయారు చేశారు. సుమారు 25కేజీల వినాయక లడ్డూ తయారు చేసినట్లు బేకరీ యజమాని అంబటి ప్రకాష్ తెలిపారు. మూడు రోజుల పాటు కార్మికులు నిష్టగా లడ్డూ తయారు చేశారు. ఏటా దేవత మూర్తుల అలంకరణలో లడ్డూ తయారు చేసి భక్తులకు అందిస్తామన్నారు.


బంగారు యజ్ఞోపవీతాన్ని అందజేస్తున్న దాతలు

చిన వెంకన్నకు స్వర్ణ యజ్ఞోపవీతం

106 గ్రాముల బంగారు జంధ్యం వితరణ

ద్వారకాతిరుమల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్నకు దాతలు బంగారు యజ్ఞోపవీతం (జంధ్యం) బహుమతిగా అందజేశారు. 106 గ్రాముల బరువైన యజ్ఞోపవీతం సుమారు రూ.11లక్షలు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. భీమవరానికి చెందిన పిన్నమరాజు శ్రీనివాసరాజు, విజయవర్మ, భూపతిరాజు, శివరామరాజు తదితరులు ఆలయ కార్యాలయంలో ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తికి అందజేశారు. ఈ బంగారు యజ్ఞోపవీతాన్ని శ్రీవారి సేవలకు వినియోగించాలని దాతలు కోరారు.


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు

38 రోజులకు రికార్డు స్థాయి ఆదాయం

ద్వారకాతిరుమల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చిన్న వెంకన్నకు హుండీల ద్వారా రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. శ్రావణమాసం కావడంతో కేవలం 38 రోజుల కాలానికి జరిగిన ఈ లెక్కింపులో శ్రీవారికి నగదురూపేణా రూ.3.61 కోట్లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. స్థానిక ప్రమోద కల్యాణమండప ఆవరణలో సోమవారం అత్యంత భద్రతాఏర్పాట్ల నడుమ హుండీ ఆదాయవ లెక్కింపు నిర్వహించారు. హుండీల ద్వారా లభించిన 3,61,54,678 రూపాయల నగదుతో పాటుగా భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 261గ్రాముల బంగారం, 6.834 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (24), 1000(1) 2000(27)తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది.

వైద్యులు తేల్చని వైకల్యం..!

తల్లిదండ్రుల సాయం లేకుండా ఏ పనీ చేయలేదు.. కనీసం మంచంపై నుంచి లేవలేదు.. ఆమె వైకల్యంపై వైద్యులు స్పష్టత ఇవ్వలేదు. ఒక ప్రభుత్వ వైద్యుడు నూరు శాతం వైకల్యం ఉందని ధ్రువీకరిస్తే ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. మరో ప్రభుత్వ వైద్యుడు నూరు శాతం వైకల్యమే కానీ తాత్కాలిక వైకల్యం అంటూ ధ్రువీకరించారు. దీనితో పింఛన్ ఆగిపోయింది. వైకల్యం తాత్కాలికం అయితే మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం సాయం చేయాలి.. వైకల్యం ఉంటే ప్రభుత్వ పింఛన్ అందించాలి. కూలి పని చేసుకుంటే కానీ పూట గడవని ఆ కుటుంబం తమ కుమార్తె భవిష్యత్ ఏమిటని కన్నీరుమున్నీరు అవుతోంది.!

- బాలిక వైకల్యం నిర్ధారణలో వైద్యుల పరస్పర విరుద్ధ నిర్ణయం
- నూరు శాతం వైకల్యం అని ఒకరు తాత్కాలికం అన్న మరో వైద్యుడు!
- దివ్యాంగుల పింఛన్ నిలిపివేత
- పేద కుటుంబానికి పెద్ద కష్టం
- న్యాయం చేయాలని వేడుకోలు

తణుకు రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ కోసం ఇద్దరు వైద్యుల వేర్వేరు ధ్రువీకరణతో ఒక బాలిక ప్రభుత్వ లబ్ధిని కోల్పోయింది. ఒక వైద్యులు శాశ్వత వైకల్యమని ధ్రువీకరించారు. మరో వైద్యుడు తాత్కాలిక వైకల్యమని ధ్రువీకరిస్తూ సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. బోగస్ పింఛన్ల ఏరివేతలో భాగంగా తాత్కాలిక వైకల్యం కారణంగా బాలిక పింఛన్ నిలిపివేస్తున్నట్లు అధికారులు నోటీసులు ఇచ్చారు.

తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామానికి చెందిన శ్రీరాముల సత్యనారాయణ, విజయదుర్గ దంపతుల కుమార్తె కుసుమ కీర్తికి పుట్టినప్పటి నుంచి మెదడు ఎదుగుదల లేకపోవడంతో రెండో ఏట నుంచే మంచానికే పరిమితమైంది. తల్లిదండ్రులు ఆమె వైద్యం కోసం అనేక ఆసుపత్రులకు తిరిగారు. ఏ నాటికైనా కుసుమ కీర్తి ఆరోగ్యం మెరుగుపడి అందరిలాగే తిరుగుతుందని ఆశించారు. ఎనిమిదేళ్ల వయసు వచ్చే వరకూ వైద్యం చేయిస్తున్నారే కానీ దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తు కూడా చేయలేదు. బంధువులు, గ్రామస్తుల సలహాతో 2017లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం శిబిరానికి కుసుమ కీర్తిని తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి ఆమెకు శాశ్వత అంగవైకల్యంగా గుర్తించి నూరు శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ అందజేశారు. అప్పటి నుంచి ఆమెకు ప్రతినెలా ప్రభుత్వం అందించే దివ్యాంగుల పింఛన్ అందుతుంది. ఇటీవల అనర్హులు కూడా పింఛన్ పొందుతున్నారనే కారణంతో వివరాల సేకరణలో భాగంగా కుసుమ కీర్తికి మరలా సదరం శిబిరంలో పరీక్షలు చేయించాలని సూచించారు. ఇటీవల తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన సదరం శిబిరంలో పరీక్షించిన వైద్యులు కుసుమ కీర్తికి నూరు వైకల్యం ఉందని, తాత్కాలిక వైకల్యం అని సర్టిఫికెట్ ఇచ్చారు. దీనితో దివ్యాంగుల పింఛన్ రద్దు చేస్తున్నట్లు అధికారులు నోటీసులు జారీ చేసి పింఛన్ నిలిపివేశారు. కుసుమ కీర్తి వైద్యం, మందుల ఖర్చులకు ఆసరాగా ఉండే పింఛన్ అందకపోవడంతో తమకు భారం పెరుగుతుందని బాలిక తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తండ్రి ఒడిలో అచేతనంగా కుసుమ కీర్తి



వైద్యం అందించి కాపాడండి..

తాపీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నా. మా కుమార్తె వైద్య ఖర్చులు భారమైనా 9 ఏళ్లు వచ్చే వరకూ పింఛన్ కోసం దరఖాస్తు చేయలేదు. నయమవుతుందనుకున్నాం మా కుమార్తెకు శాశ్వత వైకల్యం కాకపోతే వైద్యం అందించి మామూలు మనిషిని చేయండి చాలు. తణుకు వైద్యులు తాత్కాలిక వైకల్యం అని నిర్ధారించారు. దయచేసి అంగవైకల్యం లేకుండా వైద్యం అందించి మా కుమార్తె భవిష్యత్‌కు మేలు చేయండి.

- శ్రీరాముల సత్యనారాయణ, దువ్వ



మట్టి గణపతికి జై

ప్రకృతి పండుగ వినాయక చవితి

- విగ్రహాల తయారీ కళాకారులకు ఉపాధి ● తెలంగాణకు మట్టి ప్రతిమల ఎగుమతి



గణపవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి పండుగ వినాయక చవితిని మట్టి ప్రతిమలతో జరుపుకోవాలని ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. పల్లెల నుంచి పట్టణాల వరకు వినాయక విగ్రహాలు, విద్యుత్ కాంతులతో మెరిసే భారీ సెట్టింగ్‌లు చవితి ఉత్సవాల ప్రత్యేకం. పర్యావరణానికి హాని చేకూర్చే పీవోపీ ప్రతిమలు ఏర్పాటు చేయవద్దని చెబుతూ మట్టితో తయారు గణపతి ప్రతిమలను పలువురు ఉచితంగా అందజేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో కళాకారులు మట్టి విగ్రహాల తయారీతో ఉపాధి పొందుతున్నారు. కొంతమంది కాలక్షేపంగా ప్రతిమలు చేస్తూ ఉచితంగా అందజేస్తుండగా మరికొంత మంది విగ్రహాల తయారీతోనే జీవనోపాధి పొందుతున్నారు. గణపవరం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన విగ్రహ తయారీ కళాకారుడు తెలంగాణ నుంచి వచ్చిన ఆర్డర్ మేరకు మట్టి ప్రతిమలు తయారుచేసి ఎగుమతి చేస్తున్నారు. స్థానికంగా కూడా పెద్ద ఎత్తున మట్టి ప్రతిమలు సిద్ధం చేశారు. పండితులు, శాస్త్రవేత్తలు సైతం మట్టిప్రతిమలు పూజిస్తే మంచిదని సూచిస్తున్నారు.

మట్టి ప్రతిమ తయారీతో ఉపాధి



గణనాథుల మట్టి ప్రతిమల తయారీతో పదేళ్లుగా ఉపాధి పొందుతున్నాను. భక్తుల అభిరుచికి అనుగుణంగా విగ్రహాల తయారు చేయడంతో సరిపల్లెకు వచ్చి కొంటున్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, తదితర ప్రాంతాలకు మట్టి ప్రతిమలు పంపిస్తాను. మేము తయారు చేసిన ప్రతిమలు ప్రకృతికి ఏమాత్రం హాని లేకుండా నీటిలో కరిగిపోతాయి.

- కడియపు శ్రీను, తయారిదారుడు, సరిపల్లె

పర్యావరణాన్ని పరిరక్షిస్తాం



చవితి వేడుకల్లో మట్టి ప్రతిమలనే ఏర్పాటు చేసుకోవాలి. మట్టి విగ్రహాలు ఏర్పాట, సంప్రదాయంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదకర రసాయనాలు, పీవోపీ విగ్రహాలు వద్దని చెబుతున్నాం. మట్టి బొమ్మ, పచ్చని ఆకులు, పండ్లుతో ప్రజలంతా పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి.

- పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

చిన్న విగ్రహాలే మంచిది



రసాయన రంగులతో తయారు చేసి పెద్ద విగ్రహాల కంటే మట్టితో చేసిన చిన్న విగ్రహాలను ఏర్పాటు మంచిది. మట్టి ప్రతిమలు పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు. చిన్న విగ్రహాలు నిమజ్జన సమయంలో ప్రమాదాలు నివారించవచ్చు. ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించాలి. మట్టిప్రతిమల వలన నీటివనరులకు ఎలాంటి నష్టం ఉండదు.

- నక్కా రజనికుమార్, సీఐ, గణపవరం

గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్

- ప్రభుత్వం కీలక నిర్ణయం ● ఉమ్మడి జిల్లాలో 800 మండపాలు ఉంటాయని అంచనా

ఏలూరుసిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యుత్ శాఖ కూడా ఏర్పాట్లు చేస్తోంది. ఒక కిలోవాట్‌కు రోజుకు రూ.5వేల నుంచి రూ.6 వేలు ఖర్చుఅవుతుందని కూడా అంచనా వేశారు. ఉమ్మడి జిల్లాలో 800కు పైగా గణేశ్ మండపాలు ఉంటాయని అంచనా వేశారు. గణేశ్ మండపాల ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి సాల్మన్ రాజు సమగ్రంగా వివరించారు.

- మండపాలకు విద్యుత్ సరఫరా కోసం తాత్కాలిక కనెక్షన్ మాత్రమే తీసుకోవాలి. అనధికారిక కనెక్షన్లు లేదా విద్యుత్ దొంగతనం ప్రమాదకరం మరియు చట్ట విరుద్ధం.
- మండపాల ఏర్పాటుకు సంబంధిత విద్యుత్ శాఖ, పోలీస్, మునిసిపల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి.
- విద్యుత్ పనులు లైసెన్స్ పొందిన ఎలక్ట్రీషియన్స్ లేదా నిపుణులు ద్వారా మాత్రమే చేయించాలి.
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్‌కు కనీసం 3 మీటర్ల దూరంలో మండపాలు ఏర్పాటు చేసుకోవాలి. బహిరంగ కేబుల్స్ లేదా విద్యుత్ లైన్ల నుంచి సురక్షిత దూరంలో ఉండాలి.



- ప్రతి మండపానికి ప్రత్యేక ఎర్తింగ్ కనెక్షన్ ఉండాలి. ఎర్తింగ్ రాడ్ తడి నేలలో పాతాలి.
- ఐఎస్ఐ ప్రమాణాలు ఉన్న నాణ్యమైన వైర్లు వాడాలి. తెగిన వైర్లు వాడరాదు. అన్ని వైర్లు ఇన్సులేషన్ టేప్‌తో కవర్ చేయాలి.
- ఎల్ఈడీ బల్బులు/ లైట్లు వాడటం మంచిది. (తక్కువ వేడి, తక్కువ కరెంట్ వినియోగం), లైట్లు, సీరియల్ సెట్ వైర్లు గోడలకు, లోహ వస్తువులకు నేరుగా తగలకుండా అమర్చాలి.
- మినీ డీబీ బోర్డు పెట్టి అందులో ఎంసీబీ/ ఈఎల్‌సిబి అమర్చాలి. డిస్ట్రిబ్యూషన్ బోర్డు వాటర్‌ప్రూఫ్ ఉండాలి.
- తగిన సామర్థ్య ఉన్న ఫ్యూజ్ వాడాలి, ఓవర్‌లోడ్ అయ్యేంత పరికరాలు ఒకే లైన్‌లో పెట్టరాదు.
- గణేశ్ విగ్రహాల తరలింపులో విద్యుత్ లైన్లు లేదా కేబుల్స్‌కు తగలకుండా జాగ్రత్త వహించాలి.
- వర్షాకాలంలో విద్యుత్ పరికరాలు తడవకుండా చూడాలి. తడి చేతులతో తాకరాదు.
- ఏపీఈపీడీసీఎల్ హెల్ప్‌లైన్ నెంబర్ 1912 ను అత్యవసర సమయాల్లో సంప్రదించాలి.
- షార్ట్ సర్క్యూట్/స్పార్కింగ్ గమనించిన వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. పూలమాలలు, కాగితం, ప్లాస్టిక్ వస్తువులు విద్యుత్ లైన్ల వద్ద ఉంచరాదు.
- అగ్నిప్రమాదాలను నివారించటానికి విద్యుత్ పరికరాలను భక్తులకు అందుబాటులో లేకుండా ఏర్పాటు చేయాలి.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

నిబంధనలు పాటించాలి.. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు : ఎస్పీ కిశోర్



ఏలూరు క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మండపాల నిర్వాహకులు ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని, నిబంధనలు పాటించాలని ఎస్పీ కేపీఎస్.కిశోర్ సూచించారు. ఉత్సవాలతో ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మండపాల నిర్వాహకులదేనని, ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని కిశోర్ హెచ్చరించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వినాయక చవితి పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు ఇచ్చారు. భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించే వినాయకచవితి ఉత్సవాల వల్ల ఎదుటి వారికి ఇబ్బంది కలిగించకూడదని, శబ్దకాలుష్యం చేయకూడదన్నారు. మండపాలు, విగ్రహాలు ఏర్పాటుకు పోలీస్ వారి అనుమతి కోసం సింగిల్ విండో ద్వారా లింకు ఓపెన్ చేసి ఫోన్ నెంబర్ ఎంటర్ చేసి ఓటీపీ ద్వారా లాగిన్ అయి అప్లికేషన్ సబ్‌మీట్ చేయాలన్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ అధికారులు పరిశీలన చేసి అనుమతులు ఇస్తారని తెలిపారు. ఏలూరు జిల్లాలో సెక్షన్ 30 అమలులో ఉందని, ఉల్లంఘిస్తే సెక్షన్ 32 ప్రకారం, బీఎన్ఎస్ సెక్షన్ 223 ప్రకారం శిక్షార్హులు అవుతారని, ఆరు నెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా ఉంటుందన్నారు. హిజ్రాలతో నృత్యాలు, డీజే బాక్సులు ఏర్పాటు చేయడం, ఊరేగింపు నిర్వహిస్తూ ప్రజలకు అంతరాయం కల్గించడం, టపాసులు పేల్చడం వంటివి చేయకూడదని ఇలాంటి వారికి ఎవరైనా పాల్పడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. డీజే బాక్సులు ఎవరైనా అద్దెకు ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేసి బాక్సులను సీజ్ చేస్తామన్నారు. వారు కోర్టు అనుమతితోనే బాక్సులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండు మూడు నెలలు ఉపాధి కోల్పోవాల్సి ఉంటుందన్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసేవారు మండపాల వద్ద తాత్కాలికంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రొఫెసర్లు

పరిశోధనలతోనే వైజ్ఞానిక పురోగతి

నిట్ లో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): పరిశోధనలతోనే వైజ్ఞానిక పురోగతి సాధ్యమని ఎఫ్టానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో దాసరి రామకృష్ణ అన్నారు. ఏపీ నిట్‌లో 2025-26 విద్యా సంవత్సరం బీటెక్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు సోమవారం పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాసరి రామకృష్ణ మాట్లాడుతూ దేశ ప్రగతిలో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు అంతర్జాలంతో స్నేహం చేస్తే ఎన్నో కొత్త విషయాలను తెలుసుకోవచ్చన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు మాట్లాడుతూ దేశంలో 31వ నిట్‌గా అవతరించిన ఏపీ నిట్ పదేళ్ల ప్రస్థానం వివరించారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను పట్టుదలతో సాధించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు హిమబిందు, ఎస్.జయరాం, జి.రవికిరణ్‌శాస్త్రి, కార్తిక్ శేషాద్రి, వీరేశ్‌కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


సెయిలింగ్ చేస్తున్న నేవీ కేడెట్లు

సాహస యాత్రకు నేవీ కేడెట్స్ సన్నద్ధం

నరసాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని చిలక నేవీ బేసిన్‌లో వచ్చే నెల 1 నుంచి పది రోజుల పాటు జరిగే సెయిలింగ్ సాహస యాత్రకు 7ఆంధ్ర నేవీ కేడెట్లు శిక్షణ పొందుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 100 మంది ఈ యాత్రకు హాజరుకానున్నారు. అందులో 7 ఆంధ్రా నేవీ యూనిట్ నుంచి పది మందిని ఎంపిక చేశారు. వారికి రెండు రోజులుగా నేవీ యూనిట్ శిక్షణ ఇస్తుంది. పంట కాల్వలో సెయిలింగ్, బోటుకు తెరచాప కట్టడం, గాలి దిశను బట్టి ఏవిధంగా ప్రయాణించాలి, ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా బయటపడాలి అనే అంశాలపై యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ సందీజ్‌రాత్రే ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ ఇచ్చారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో భవానికి రజతం

ఏలూరు రూరల్, ఆగస్టు 25, (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో జరిగిన యూత్ కామన్వెల్త్ మహిళల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రాతినిధ్యం వహించిన విజయనగరం జిల్లాకు చెందిన రెడ్డి భవాని రజత పతకం సాధించింది. పతక విజేతకు ఏపీ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు నీలంశెట్టి లక్ష్మి, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు టి.దీన్నాబాబు, ఏపీ ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బడేటి వెంకట్రామయ్య, వెయిట్ లిఫ్టర్లు, నగర ప్రముఖులు అభినందించారు.


రజత పతకం విజేత రెడ్డి భవాని


పురస్కారం అందుకుంటున్న చిత్రకారుడు వెంపటాపు


వెంపటాపు గీసిన చిత్రం

శ్రమైక చిత్రంతో మెరిసిన వెంపటాపు

రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌లో పురస్కారం

తణుకు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి గ్రూప్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో శ్రమైక సౌందర్యంపై చిత్రం గీసిన తణుకు పట్టణానికి చెందిన వెంపటాపు అభినందన పురస్కారం అందుకున్నారు. ఇటీవల విజయవాడ బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ కళా యజ్ఞ ఆధ్వర్యంలో ఆదివారం 'శ్రమైక జీవన సౌందర్యం' అంశంపై రాష్ట్రస్థాయి చిత్రకళా ప్రదర్శన, 'వర్తమాన పరిస్థితుల్లో చిత్రకారుడి పాత్ర' అంశంపై సెమినార్ జరిగింది. వెంపటాపు చిత్రించిన ఉడ్ డిజైనర్ చిత్రం పలువురి ప్రశంసలు అందుకుంది. రాష్ట్రస్థాయిలో 40 మందికి పైగా చిత్రకారులు పాల్గొని హృద్యమైన చిత్రాలు ప్రదర్శించినట్లు వెంపటాపు తెలిపారు. యోగి వేమన యూనివర్సిటీ హెచ్‌వోడీ మృత్యుంజయ రావు, కళాయజ్ఞ ఏలూరి శేషబ్రహ్మం, చిత్రకళావధాన్ ఉదయ్‌కుమార్ వెంపటాపును సన్మానించారు. పలువురు ఆయనను అభినందించారు.

అరుణాచలం, బెంగళూరు రైళ్లు పొడిగింపు



నరసాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నరసాపురం నుంచి వారానికి ఒకసారి నడిచే అరుణాచలం (తిరువణ్ణామలై), బెంగళూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రూట్‌లో ప్రయాణికుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ ఏడాది ప్రారంభమైన నరసాపురం - తిరువణ్ణామలై (అరుణాచలం) రైలు గడువు సెప్టెంబరుతో ముగియనుంది. ఇప్పటికే ఈ రైల్లో అన్ని తరగతుల రిజర్వేషన్లు ఫుల్ అయ్యాయి. డిమాండ్‌ను గుర్తించిన రైల్వే అక్టోబర్ 25 వరకు పొడిగించారు. ఈ రైలు ప్రతి బుధవారం నరసాపురంలో మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 4 గంటలకు తిరువణ్ణామలై చేరుతుంది. తిరిగి అక్కడ ఉదయం 11 గంటలకు బయలుదేరి రాత్రి 2 గంటలకు నరసాపురం వస్తుంది.

నరసాపురం నుంచి నడిచే బెంగళూర్ ఎక్స్‌ప్రెస్‌ను డిసెంబర్ 26 వరకు పొడిగించారు. షెడ్యూల్ ప్రకారం గడువు అక్టోబర్ 3తో ముగియనుండగా డిసెంబర్ 26 వరకు పొడిగించారు. ప్రతి శుక్రవారం నరసాపురంలో సాయంత్రం 3.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు బెంగుళూరు చేరుకుటుంది. అదేరోజు అంటే శనివారం అక్కడ 10.50 బయలుదేరి ఆదివారం ఉదయం 6.15గంటలకు నరసాపురం వస్తుంది. ఈ ఎక్స్‌ప్రెస్ విజయవాడ, రేణుగుంట, కాట్‌పాటి మీదుగా నడుస్తుంది. పొడిగింపులోనే ఇదే రూట్, ఇదే షెడ్యూల్ సమయాల్లో నడవనుంది.



ఆయుష్ మేళాలో ఆయుర్వేద, యునాని, హోమియోపతి విభాగాల అసిస్టెంట్ డైరెక్టర్లు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

ఆన్‌లైన్‌లో ఆయుష్ అనుమతులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద, యునాని, హోమియోపతి మందుల తయారీ యూనిట్లు, రిటైల్ దుకాణాల నిర్వాహకులు తమ లైసెన్సులను తక్షణమే రెన్యువల్ చేయించుకోవాలని, లేకుంటే రద్దయినట్టుగా పరిగణిస్తామని ఆయుష్‌శాఖ ఆయుర్వేద విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ సాయి సుధాకర్ హెచ్చరించారు. ఉభయగోదావరి, కృష్ణాజిల్లాల్లోని ఆయుర్వేద, యునాని, హోమియోపతి మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు, రిటైల్ మందుల దుకాణాలకు పెండింగ్ లైసెన్సుల జారీ, రెన్యువల్స్ నిమిత్తం ఏలూరులోని ఆయుష్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో ఆయుష్‌మేళాకు మూడు విభాగాల ఏడీలు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సోమవారం హాజరయ్యారు. వచ్చే నెల నుంచి ఆయుష్ విభాగాలు జారీచేసే అనుమతులు, రెన్యువల్స్ అన్నీ ఆన్‌లైన్ విధానంలో జరుగుతాయన్నారు. ఆయుర్వేద రాష్ట్ర డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ కేన్సర్ పూర్తిగా నివారిస్తామని, ఊబకాయాన్ని తగ్గిస్తామని, తదితర ప్రచారంతో రోగులను నమ్మబలకడం ఆయుర్వేద చట్టం ప్రకారం మోసం చేయడమేనన్నారు. అనైతిక చర్యలకుపాల్పడిన వారిపై కేసులు నమోదుచేయడం జరిగిందన్నారు. హోమియోపతి రాష్ట్ర డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామత్లేహి మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపువున్న హోమియోపతి వైద్య నిపుణుడి సలహామేరకు మందులు వాడితేనే రోగులకు సత్ఫలితాలు, ఉపశమనం లభిస్తాయని, నేరుగా మందుల దుకాణాలకు వెళ్లి వాటిని వినియోగించడంవల్ల ఉపయోగం ఉండదన్నారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆయుర్వేద విభాగం సీనియర్ మెడికల్ ఆఫీసర్ బి.భాస్కర్ మాట్లాడుతూ 10 పడకలతో కూడిన ఆయుర్వేద డిస్పెన్సరీ నిర్మాణానికి నిధులున్నాయని, స్థలం కేటాయించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అభ్యర్థించామన్నారు. ఆయుష్ మేళాలో యునాని విభాగం ఏడీ శేఖర్, హోమియోపతి ఏడీ సుజాత, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు లైకూర్ రెహమాన్, రిటైల్ వర్తకులు, తయారీ యూనిట్ల యజమానులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్



ఏలూరు క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై ఎస్టీ వసతి గృహంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లి దండ్రులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించాలన్నారు. బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్ల తర్వాత వివాహాలు నిర్వహిస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటారన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే 1098 లేదా 15100 నంబర్లకు తెలియజేయాలని, అలా తెలియచేసిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతారని తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, వసతి గృహ వార్డెన్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి మంగారాణి

డీఎస్సీలో 5 పోస్టులకు అర్హత సాధించిన గిరిజన యువతి



వేలేరుపాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చదువులో ప్రతిభ కనబరిచిన గిరిజన యువతి మంగారాణి చదువు నేర్పే గురువైంది. వేలేరుపాడు మండలం కొయమాధారం గ్రామానికి చెందిన నాగుల మంగారాణి డీఎస్సీలో ఐదు విభాగాల్లో ఉద్యోగాలకు అర్హత సాధించి శభాష్ అనిపించుకుంది. ఎస్టీ నాయకకోడు ఎస్సీ కేటగిరిలో జోన్-2 లో ప్రతిభ చాటింది. ఎస్ఏ మ్యాథ్స్‌లో ఫస్ట్ ర్యాంకు, ఎస్ఏ ఫిజిక్స్ ఫస్ట్ ర్యాంకు, టీజీటీ మ్యాథ్స్ ఇంగ్లీష్ మీడియంలో 4ర్యాంకు, టీజీటీ ఫిజిక్స్ ఇంగ్లీష్ మీడియంలో ఫస్ట్ ర్యాంకు, టీజీటీ సైన్స్ ఇంగ్లీష్ మీడియంలో 2వ ర్యాంకు సాధించింది. మొత్తం ఐదు విభాగాల్లో అర్హత సాధించింది. మంగారాణి తండ్రి తెలంగాణలోని అశ్వారావుపేట మండలంలో, ఆమె సోదరి వేలేరుపాడులో రామవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. మంగారాణి పదో తరగతి వరకు వేలేరుపాడు జడ్పీ పాఠశాలలో విద్యనభ్యసించగా 10వతరగతి ఫలితాల్లో మండలంలో మొదటి ర్యాంకు సాధించింది. చదువుల్లో ఎప్పుడు ముందుంటుందని, అనుకున్నది సాధించేవరకు తీవ్రంగా శ్రమించడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయని మంగారాణి తండ్రి రమణయ్య ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన మంగారాణికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

అక్టోబరులో ఐఎఫ్‌టీయూ రాజకీయ తరగతులు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఐఎఫ్‌టీయూ రాష్ట్రస్థాయి రాజకీయ తరగతులను అక్టోబరులో నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ తెలిపారు. కె.పోలారి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయకచవితి, ఇతర పండుగలు, వివిధ కారణాల వలన రాష్ట్ర సభలను వాయిదా వేసినట్లు తెలిపారు. అక్టోబరులో జరిగే రాష్ట్రస్థాయి రాజకీయ తరగతులకు కార్మిక, వర్తక, వ్యాపార, వాణిజ్య వర్గాలు సహకరించాలని కోరారు. కేంద్రంలోని మోదీ, షా ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు, రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారంలోని 34 విభాగాలను ప్రైవేటీకరణ, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ గ్రామాలపై దాడులను ఖండించారు. ఆటో, మోటారు కార్మికుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. భవన నిర్మాణ ఇతర అసంఘటిత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

అక్షర విజయం

'ఆంధ్రజ్యోతి' అక్షరం అజెండాలో సమస్యలు విన్నారు.. పరిష్కరించారు

- నూజివీడులో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.200 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు డీపీఆర్
- పట్టణంలో 'ఆంధ్రజ్యోతి' సక్సెస్ మీట్



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ



నూజివీడు,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో ఈ ఏడాది జనవరి 28వ తేదీన ప్రజా సమస్యలపై 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా వినూత్నమైన కార్యక్రమాన్ని ఆంధ్రజ్యోతి నిర్వహించింది. ఈ సందర్భంగా అక్షరం అజెండాలో మున్సిపల్ అధికారులు సమస్యలు విన్నారు.. పరిష్కరించారు. నూజివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన సభ నిర్వహించి, నూజివీడు మునిసిపల్ ప్రజలను ఆహ్వానించింది. అక్కడ సమస్యలన్నీ చైర్‌పర్సన్ విన్నారు. వాటిని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లేందుకు ఆంధ్రజ్యోతి తనవంతు పాత్రను పోషించింది. అనంతరం సమస్యల పరిష్కారానికి మంత్రి పార్థసారథి తనదైన శైలిలో కృషిచేశారు. నూజివీడు పట్టణాన్ని ముంపునకు గురిచేసిన పెద్దచెరువు గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ఆదేశించారు. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో పెద్దచెరువు గండ్లను పూడ్చటమే కాక చెరువుకట్టను అభివృద్ధి పరిచారు. ఇవేకాక మరో రూ.8 కోట్ల వరకు నిధులను మంజూరు చేయించి ప్రజలు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు కేటాయించారు. దీనిలో భాగంగానే నూజివీడు సంగం కాంప్లెక్స్‌లో 'ఆంధ్రజ్యోతి' సోమవారం సాయంత్రం 4 గంటలకు తణుకు యూనిట్ ఎడిషన్ ఇన్‌చార్జి రామకృష్ణ అధ్యక్షతన సక్సెస్ మీట్ నిర్వహించింది. ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ హాజరై మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో నిర్మాణాత్మకమైన పాత్రను ఆంధ్రజ్యోతి పోషించిందన్నారు.

అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు : పగడాల

నూజివీడు మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ సీఆర్‌డీఏ నిధుల కింద నూజివీడు పట్టణంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులకు సమానంగా అభివృద్ధి పనులను కేటాయించా మన్నారు. పట్టణంలోని 32 వార్డుల్లో రహదారుల అభివృద్ధి, డ్రెయిన్‌ల నిర్మాణం చేపడతామన్నారు. గత జనవరిలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన సదస్సులో ప్రజలనుంచి వచ్చిన సమస్యల్లో దాదాపు 80శాతం సమస్యలు పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నాయన్నారు. కోతులు, కుక్కల బెడద ఉన్నా కొన్ని సాంకేతిక పరమైనటువంటి అంశాలతో వాటిని పరిష్కరించలేని పరిస్థితి నెలకొందన్నారు. పట్టణంలో పలు రహదారుల అభివృద్ధికి బీటీ వర్క్ నిర్వహించేందుకు రూ.80లక్షల వ్యయంతో అంచనాలు సిద్ధం చేశామని, త్వరలో అభి వృద్ధి పనులు చేపడతామన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణంకు సంబంధించి స్థల సేకరణకు చర్యలు చేపట్టామన్నారు. జాతీయ స్థాయిలోనే నూజివీడును మణిహారంగా తీర్చేదిశగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.200 కోట్లతో డీపీఆర్‌ను కేంద్రానికి పంపించామన్నారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో పనులు ముందుకు సాగి.. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజి వ్యవస్థ, రింగ్ రోడ్డు ఏర్పాటయితే నూజివీడు అభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు.

రహదారుల విస్తరణ జరగాలి : నూతక్కి



నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు నూతక్కి వేణుగోపాలరావు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి అక్షర సమరంతో మున్సిపాల్టీలోని ప్రతి సమస్యకు ఒక్కొక్కటిగా పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారు. ఆంధ్రజ్యోతికి ప్రజాపక్షం గొంతుక ఉండడం వల్లే ఇది సాధ్యం. నూజివీడు పట్టణం అభివృద్ధి చెందాలంటే వ్యాపారరంగం ముందడుగు వేయాలి. మెగా మాల్స్ వచ్చి చిరువ్యాపారులు దెబ్బతిన్నారు అనడం సరికాదు. జమిందారీ కాలం నాటి రోడ్లు, విస్తరణ జరగకపోవడం వల్లే పార్కిం గ్ సమస్య, ట్రాఫిక్ సమస్యతో వ్యాపారాలు అభివృద్ధి చెందడం లేదు. రహదారుల విస్తరణ జరిగితే అన్ని వ్యాపారాలు గాడినపడతాయి. మంత్రి కొలుసు పార్థసారథి పట్టణంలో ఇండోర్ స్టేడియానికి రూ.కోటి 75 లక్షలు మంజూరు చేయించి, వాడుకలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి చొరవతో సమస్యల పరిష్కారం : నాగరాణి



నూజివీడు పట్టణ భారతీయ జనతాపార్టీ అధ్యక్షురాలు ఎం.నాగరాణి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి చొరవతో అనేక సమస్యలు పరిష్కారమయ్యేదిశగా అడుగులు పడ్డాయని, అయితే పలు అవసరాలరీత్యా నూజివీడు పట్టణానికి వస్తున్న ప్రజలు టాయ్‌లెట్‌కు వెళ్లేదుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, ప్రధానంగా మహిళలను దృష్టిలో పెట్టుకుని నూజివీడు పట్టణంలో పబ్లిక్ టాయ్‌లెట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరత ఉందన్నారు.

- ఆంధ్రజ్యోతి తాడేపల్లిగూడెం యూనిట్ బ్రాంచి మేనేజరు హరిబాబు మాట్లాడుతూ 'అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా కార్యక్రమం' ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య ఆలోచనల నుంచి పురుడు పోసుకుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలతో ముడిపడి ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రజ్యోతి కృషి చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 కేంద్రాల్లో సదస్సులు నిర్వహించి, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం దిశగా విజయం సాధించగలిగామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి జీవీఎస్ఎన్ రాజు, యాడ్స్ మేనేజర్ రాజు, నూజివీడు మున్సిపల్ ఏఈ వంశీ అభిషేక్, టీపీవో కె.వెంకటేశ్వర రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఆర్ఐ ఆర్.సందీప్, ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనూ సదస్సులు నిర్వహించాలి



'అక్షరం అండగా.. పరిష్కారం అజెండా' సక్సెస్ మీట్ అంటే కార్యక్రమా నికి హాజరయ్యా. దాదాపు 8 నెలల క్రితం నిర్వహించిన సదస్సులో ప్రస్తావించిన అంశాలకు పరిష్కారా లను ఆంధ్రజ్యోతి చూపగలిగింది. ఇటువంటి సదస్సులు పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏర్పాటుచేస్తే అభివృద్ధి చెందుతాయి. పట్టణంలో మొగలిచెరువు కాలుష్యానికి నిలయంగా మారుతోంది. దానిని శుభ్రపరిచి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తే బాగుంటుంది.

- కిశోర్, సుంకొల్లు, నూజివీడు మండలం

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి



నూజివీడు పట్టణంలో ఐదు గంటలు దాటితే రోడ్లపై వాహనం నడపాలంటే కత్తిమీద సామే. సమస్య పరిష్కారానికి రహదారుల విస్తరణతో పాటు నూజివీడులో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. పట్టణంలో కోతులు, కుక్కల బెడద అధికంగా ఉంది. రూ.లక్షతో ఇంటికి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాం. నిరుపేదల పరిస్థితిని అర్థం చేసుకుని మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలి.

- కె.ప్రభాకర్, విశ్రాంత ఆంధ్రా బ్యాంకు మేనేజర్

మనిషి ప్రాణం కంటే జంతువులే ముఖ్యమా ?



జంతు ప్రేమికులు, కుక్కలు, కోతులకు హానిచేయకూడదని సూచిస్తున్నారు. అటువంటప్పుడు కోళ్లను, మేక మాంసాన్ని ఏవిధంగా విక్రయిస్తున్నారు ? మనుషుల ప్రాణంకంటే జంతువుల ప్రాణమే ముఖ్యమా? దీనిపై పూర్తిస్థాయిలో జంతు ప్రేమికులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. దీనికి ప్రతి ఒక్కరం సిద్ధంగా ఉండాలి.

- టి.లాజరస్, నూజివీడు

కొన్ని సూచనలతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం



నూజివీడు పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను కొన్ని సూచనలతో పరిష్కరించవచ్చు. ప్రధానంగా వాహనాలు నిలుపుదల చేస్తున్న ప్రదేశాలను కొద్దిగా మార్పుచేస్తే ఆ సమస్యను అధికమించవచ్చు. దీనికి సంబంధించి పోలీస్, ఆర్టీసీ, ఆర్టీఐ, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తే బాగుంటుంది.

- నడికట్ల వెంకటేశ్వరరావు, నూజివీడు

నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా 'ఆంధ్రజ్యోతి'



ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా ఆంధ్రజ్యోతి వ్యవహరిస్తోంది. లిక్కర్ ధరలు పెంచి, విక్రయించడంపై ఆంధ్రజ్యోతి ఇచ్చిన కథనాలతో ఏకంగా ఆ శాఖ అధికారులే కదలివచ్చారు. అదేరీతిన గత 8 నెలల క్రితం నిర్వహించిన సదస్సులో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిష్కారం చూపేదిశగా ఆంధ్రజ్యోతి తీసుకున్న చొరవ అధికారుల పనితీరుకు ఈ సక్సెస్ మీటే నిదర్శనం.

- ఎం.రాజశేఖర్, నూజివీడు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

13 మంది విద్యార్థినులకు టైఫాయిడ్

- జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స
- తాగునీరు, వంటకు వాడే నీటిపై అనుమానం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహానికి చెందిన ఇంటర్ చదువుతున్న 13 మంది విద్యార్థినులు శనివారం ఒకేరోజు టైఫాయిడ్ జ్వరం బారిన పడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం హాస్టల్ సిబ్బంది విద్యార్థినులను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరంతా పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో వృత్తి విద్యతో పాటు పలు ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ విద్యనభ్యసిస్తున్నారు. శనివారం కళాశాలలకు వెళ్లి వచ్చిన తరువాత అందరికీ ఒకేసారి జ్వరం రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హాస్టల్లో వంటకు ఉపయోగించిన నీటిలో గానీ, విద్యార్థినులు తాగడానికి ఉపయోగించిన నీటిలో గానీ ఏదైనా తేడాలుండే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఏటీడబ్ల్యూవో శ్రీవిద్య, హాస్టల్ వార్డెన్ పద్మజలు సోమవారం పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. హాస్టల్లో వాడుతున్న నీటి శాంపిల్‌ను అపిడిమిక్ విభాగం సిబ్బంది రవి కుమార్, నరేంద్ర సేకరించారు. ఉన్నతాధికారులు ఈ ఘటనపై ప్రత్యేక పెట్టి విద్యార్థినులకు ఒకేసారి టైఫాయిడ్ జ్వరం రావడానికి గల కారణాలపై విచారణ చేపట్టాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బస్సు టైరు పేలడంతో ప్రయాణికుల బెంబేలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వద్ద సోమవారం మధ్యాహ్నం హైటెక్ బస్సు టైరు పెద్ద శబ్దంతో పేలిపోవడంతో స్థానికులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అత్యంత ప్రమాదకర మలుపు వద్ద ఈ ఘటన జరిగడంతో బస్సు షేక్ అయిపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులంతా ఏం జరుగుతుందో తెలియక ఆహాకారాలు పెట్టారు. డ్రైవర్ చాకచక్యంగా బస్సును కంట్రోల్ చేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఒక పక్క మలుపు, మరోపక్క చెరువు, ఇంకో పక్క పంట బోదె వీటి మధ్యలో బస్సు ఆగడం చాలా అదృష్టమని స్థానికులు పేర్కొన్నారు. రేలంగికి చెందిన వారు తీర్థయాత్రల నిమిత్తం కర్ణాటక, కేరళ తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడ్డారు. బస్సు టైరు మార్చి ప్రయాణికులను తీసుకెళ్లారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్



యువకుడిని కిందికి దించిన దృశ్యం

కొయ్యలగూడెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఎక్కి ఒక యువకుడు హల్‌చల్ చేశాడు.సోమవారం తెల్లవారు జామున 4గంటల సమయంలో పట్టణా నికి చెందిన తిర్నాతి అయ్యప్ప మద్యం మత్తులో సెల్‌టవర్ చివరి వరకు ఎక్కాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసు లకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడికి చేరు కుని యువకుడిని కిందికి దింపడానికి నానా తంటాలు పడ్డారు. తన స్నేహితుడిని టవర్‌పైకి ఎక్కించి పోలీసులతో మాట్లాడించి నచ్చజెప్ప డంతో ఎట్టకేలకు 10.30 గంటల ప్రాంతంలో కిందకు దిగాడు. దీంతో పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎస్.ఐ. చంద్రశేఖర్ ఆ వ్యక్తికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణంలో ప్రజలు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. మద్యం మత్తులోనే టవర్ ఎక్కినట్టు ఎస్.ఐ. చంద్రశేఖర్ తెలిపారు.

నేడు డీఎస్సీ సెలెక్టెడ్ అభ్యర్థులకు కాల్‌లెటర్లు

28న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ - టీమ్‌లవారీగా అభ్యర్థుల కేటాయింపుల వల్లే జాప్యం

ఏలూరు అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్ ఐడీలకు మంగళవారం మధ్యాహ్నం నుంచి కాల్ లెటర్ వస్తుందని, ఆ కాల్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. వాయిదా పడిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈ నెల 28న ఉదయం 9 నుంచి ఏలూరు శివారు వట్లూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామని వివరించారు. ఇంతకు ముందు సూచించిన విధంగానే అభ్యర్థులన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు, కులధ్రువీకరణ, డిజేబుల్డ్ సర్టిఫికెట్, స్టడీ/రెసిడెన్షియల్ సర్టిఫికెట్, టెట్ మార్కుల కాపీ, డీఎస్సీ హాల్ టికెట్, ఆధార్ కార్డు, 5 పాస్ పోర్టుసైజు ఫోటోలతో హాజరుకావాలని కోరారు. ముందుగా అభ్యర్థి తన ఒరిజినల్ సర్టిఫికెట్లనన్నింటినీ వ్యక్తిగత లాగిన్‌లో స్కాన్ చేసి ఏపీడీఎస్సీఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఏదైనా సందేహాలుంటే హెల్ప్ లైన్ నంబరు 90307 23444లో సంప్రదించాలన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైనంత మాత్రాన ఉద్యోగ ఎంపికలపై అభ్యర్థికి ఎటువంటి హక్కు ఉండబోదని, ఎంపికలు పూర్తిగా మెరిట్, అర్హతలు, రిజర్వేషన్, నిబంధనలకు లోబడి ఉంటాయని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, సమయానికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వేదికవద్దకు హాజరుకావాలని, గైర్హాజరైనా లేదా అర్హతలు లేకపోయినా అభ్యర్థిత్వం రద్దవుతుందని వివరించారు.తదుపరి మెరిట్ జాబితాలోని అభ్యర్థిని సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలుస్తామన్నారు.

జాప్యం ఎందుకంటే...

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1074 ఉపాధ్యాయ ఉద్యోగాలకు విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి మెరిట్ కం రోస్టర్ ఆధారంగా సెలక్షన్లు ఆదివారమే ఖరారుకాగా, వాటిని జిల్లాల్లో నిర్వహించాల్సిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం ఏర్పాటు చేసిన ముగ్గురు గెజిటెడ్ ర్యాంకు అధికారులతో కూడిన టీమ్‌లకు సాఫ్ట్ వేర్‌లో మ్యాచ్(అనుసంధానం) చేయడం పూర్తి కాకపోవడం వల్లే తుది ఎంపిక జాబితాలు విడుదలకాకపోవడానికి లేదా కాల్ లెటర్లు జారీ కాకపోవడానికి ప్రధాన కారణమని సమాచారం. దీనికి అనుగుణంగానే ఉద్యోగాలకు సెలెక్ట్‌అయిన అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌లకు ఇంటిమేషన్/కాల్ లెటర్లు ఇంతవరకు జారీకాలేదు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఏర్పాటు చేసిన ఒక్కోటీమ్‌లో ఒక ఎంఈవో, సీనియర్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దార్ ఉంటారు. ఉమ్మడి జిల్లా అభ్యర్థుల కోసం ఇలా మొత్తం 23 టీమ్‌లను ఏర్పాటు చేశారు. టీమ్‌కు 50మంది అభ్యర్థులు చొప్పున సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు కేటాయించారు. కాల్ లెటర్లు అందుకునే మొత్తం 1074మంది అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకునే నిమిత్తం వారికి కేటాయించిన టీమ్ నంబరు, సమయం, ఇతర వివరాలన్నింటినీ అభ్యర్థికిపంపే ఇంటిమేషన్‌లోనే తెలియజేస్తారు. దానిప్రకారమే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుంది. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియలో ఎవరి ప్రమేయంగాని, రికమండేషన్లు, పరిచయాలతో సంబంధం లేకుండా పారదర్శకంగా జరిగేందుకు వీలుగా దీనిని రాష్ట్రస్థాయిలో కేంద్రీకృతం చేశారు. మరోవైపు ఒక్కో అభ్యర్థికి కనీసం 15నిమిషాలకుపైగానే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సమయం పడుతుందని, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లు నిడివిఎక్కువగా ఉండి పరిశీలన కేంద్రం టీమ్ వద్ద సిస్టంలో ఓపెన్ కావడానికి ఎక్కువసమయం తీసుకుంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఒక్క రోజులోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తికాకపోతే మరుసటి రోజు కూడా కొనసాగించేందుకు వీలుగానే ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా కాల్‌లెటర్/ఇంటిమేషన్ జారీ ఆలస్యమవుతుండటంతో తుది ఎంపికలపై అభ్యర్థుల్లో ఎదురుచూపులు, ఉత్కంఠ కొనసాగుతూనేఉన్నాయి.

ప్రియురాలిని హతమార్చిన ప్రియుడికి జీవిత ఖైదు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రెండేళ్ల పాటు సహజీవనం చేసిన ప్రేయసిని అనుమానంతో తలపై కర్రతో కొట్టి హత్య చేసిన ప్రియుడు కె.పెంటపాడుకు చెందిన చేవలపాటి శ్రీనుకు తాడేపల్లిగూడెం జిల్లా పద కొండవ అదనపు జడ్జ్ షేక్ సికిందర్ జీవిత ఖైదు, పదివేల జరిమానా విధించారు. దీనికి సంబంధించి అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుసులూరి శివరామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కె.పట్టింపాలేనికి చెందిన ముప్పిడి కుమారితో రెండేళ్ల పాటు సహజీవనం సాగించాడు. అనుమానంతో యువతిపై కర్రతో తలపై కొట్టడంతో మృతి చెందింది. దీనిపై దర్యాప్తులో సీఐ బి.భీమేశ్వర రవికుమార్, ఎస్సై జీవీఎస్ ప్రసాద్‌లు సహకరించగా నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధించినట్టు వివరించారు.

ఇద్దరు ట్రాక్టర్ దొంగల అరెస్టు

ఏలూరు క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ చోరీ కేసులో ఇద్దరిని ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను ఎస్పీ కేపీఎస్ కిశోర్ సోమవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి పంచాయతీ లింగారావుగూడెం గ్రామానికి చెందిన సున్నా కిశోర్ రూ.ఐదు లక్షలతో ట్రాక్టర్ కొనుగోలు చేసి ఇంటి ముందు పెట్టగా ఈ నెల 18వ తేదీ రాత్రి సైలెంట్‌గా ఎత్తుకెళ్లారు. వట్లూరు వెళ్లే మినీ బైపాస్ రోడ్డులో పి.వెంకటేశ్వరరావు వెంచర్ ఖాళీ స్థలాల్లో వాటర్ ట్యాంక్ పక్కన ట్రాక్టర్ ఇంజన్ దాచి దానిని తీసుకెళ్లేందుకు ఇద్దరు యువకులు ప్రయత్నించగా సోమవారం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. పల్నాడు జిల్లాకు చెందిన యన్నం హరిబాబు (37), మందన రవీంద్రనాథ్ రెడ్డి (35)లను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

నకిలీ పత్రాలతో బ్యాంకుకు టోకరా

- రూ.రెండున్నర కోట్ల రుణం కుంభకోణంలో ముగ్గురి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రుణాల పేరుతో ఏయూ బ్యాంక్‌ను, ప్రజలను మోసగించి రూ.రెండున్నర కోట్లు స్వాహా చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్, అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్‌లు పాల్గొన్నారు. ఏలూరులో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్‌లో గతంలో క్రెడిట్ ఆఫీసర్‌గా పని చేసిన గొల్లగూడేనికి చెందిన వరపుల ఫణీంద్ర కుమార్(33), ఏలూరు బీడీ కాలనీ పొగాకు గొడౌన్ దగ్గరలో నివాసం ఉంటున్న లోను బ్రోకర్ ప్రసాదం జయకృష్ణ(32) దెందులూరు మండలం మేధినరావుపాలెం గ్రామానికి చెందిన లోను బ్రోకర్ మూసి సీతారామయ్య(32)లతో పాటు మరికొంత మందికి రుణాలు ఇప్పిస్తామని వారి నుంచి ఆధార్, పాన్ కార్డులు తీసుకుని నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి ఏయూ ఫైనాన్స్‌లో చూపించి రుణాలు తీసుకుని వారికి కొంత సొమ్ము ఇచ్చి మిగిలిన సొమ్ము వీరు స్వాహా చేసేవారు. ఇలా 27 మంది నుంచి ఆధార్, పాన్ కార్డులు తీసుకుని నకిలీ డాక్యుమెంట్స్ తయారు చేసి ఆ బ్యాంక్ నుంచి రూ.రెండున్నర కోట్ల నగదును రుణంగా పొంది స్వాహా చేశారు. ఈ ఘటనపై ఆ బ్యాంక్ విజయవాడ జోనల్ సేల్స్ మేనేజర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేయడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఏలూరు పాతబస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న వరపుల ఫణీంద్రకుమార్, ప్రసాదం జయకృష్ణ, మూసి సీతారామయ్యలను అరెస్టు చేసి వారి నుంచి నకిలీ డాక్యుమెంట్స్ ఇతర పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేయడానికి దర్యాప్తు జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఎవరైనా లోన్లు ఇప్పిస్తామని ఆధార్‌కార్డులు, పాన్ కార్డులు అడిగితే ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

కొయ్యలగూడెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):ఉపాధి కూలీలకు తక్షణమే బకాయిలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాంబాబు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు తక్షణమే బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. 10 వారాల నుంచి వేతనాలు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ కార్యాలయంలో ఉద్యోగులకు వినతిపత్రం అందజేశారు. మల్లిక, ముత్యాలు, రాజేశ్వరి, రామకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

ద్వారకాతిరుమల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి విద్యార్థి ఓ మొక్కను నాటాలని మాజీ జెడ్పీటీసీ, లైన్స్ క్లబ్ అధ్యక్షురాలు మొగతడకల లక్ష్మీరమణి అన్నారు. ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం జడ్పీ హైస్కూల్లో సోమవారం లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవరపల్లి రాయుడు బాబు, పావులూరి మధు, ఆనంద్ కుమార్, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో సత్తా చాటిన పసుపులేటి సాయి చందు



జీలుగుమిల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో పసుపులేటి సాయి చందుకు ఉత్తమ ర్యాంకు వచ్చింది. డీఎస్సీలో 150 మార్కులకు 147.8 మార్కులు సాధించి 22వ ర్యాంకులో నిలిచాడు. గత ఏడాది 2024 తెలంగాణ డీఎస్సీ పరీక్షల్లోనూ 9వ ర్యాంకు సాధించాడు. టెన్త్ స్థానిక ప్రభుత్వ జడ్పీ పాఠశాల్లో చదివి 97 శాతం మార్కులు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన సాయిచందు ఇరు తెలుగు రాష్ట్రాల్లో డీఎస్సీ పరీక్షలు రాసి రెండు చోట్ల ఎంపికవడం విశేషం.

ఒంగోలు సీపీఐ మహా సభలు విజయవంతం

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో ఒంగోలులో సోమవారం వరకు జరిగిన 28వ రాష్ట్ర మహాసభలు విజయవంతమయ్యాయని సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే, పళ్లెం కిషోర్, బి.జగన్నాథరావులు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ అంచనాలకు మించి రాష్ట్ర నలుమూలల నుంచి ఈ మహా సభలకు పెద్ద ఎత్తున కళాకారులు, కార్యకర్తలు తరలివచ్చారన్నారు. మహాసభల సందర్భంగా నిర్వహించిన కొమ్ము డ్యాన్సులు, రేలారే నృత్యాలు, కళాకారులు నిర్వహించి డప్పు వాయిద్యాలు ఒంగోలు నగరాన్నే హోరెత్తించాయన్నారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోండి

బుట్టాయగూడెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ మహిళపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం మండలం ఇనుమూరుకు చెందిన ఆదివాసీ మహిళపై జంగారెడ్డిగూడెంకు చెందిన గుబ్బల సత్యన్నారాయణ మరికొందరు ఈ నెల 14న దాడిచేసి హత్యాయత్నం చేశారని ఆరోపించారు.బాధిత మహిళ జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సాధారణ కేసుగా నమోదు చేయడం పట్ల ఆదివాసీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అట్రాసిటీ కేసుగా నమోదు చేయకుంటే పోలీసులపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు, జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు తెలియజేశారు.

ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధిని అందిపుచ్చుకోవాలి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దళిత బహుజన బడ్జెట్‌వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవ కుమార్ అన్నారు. లేడీస్ క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, అత్యాచారాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసుల్లో కోర్టు తీర్పు త్వరితగతిన ఇవ్వాలన్నారు.దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ అధ్యక్షులు మణిసింగ్, జిల్లా కన్వీనర్ సింగవరపు జ్యోతి, కోఆర్డినేటర్ హేమలత పాల్గొన్నారు.

అభివృద్ధి, సుపరిపాలన కూటమితోనే సాధ్యం

పెదపాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. వట్లూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటా పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.సీనియర్ నాయకులు కొమ్మన వెంకట శ్రీధర్, వట్లూరు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ కొమ్మన లక్ష్మణ మోహన్‌లతో కలిసి గ్రామంలో పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నెహ్రూకాలనీతో పలుచోట్ల సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ముళ్ళపూడి సాంబశివరావు, మరడాని రవి, కొమ్మన బసవయ్య, ఇవో ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రీపోస్టింగ్‌ల కోసం ఎంపీహెచ్‌ఏల వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): న్యాయం కావాలంటూ ఎంపీహెచ్‌ఏ (మేల్)లు సోమవారం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రాలను వేర్వేరుగా సమర్పించారు. వైద్య ఆరోగ్య శాఖలో పారామెడికల్ రిక్రూట్‌మెంట్-2002లో మెరిట్ కం రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం నియామకాలు పొంది ప్రస్తుతం ఎంపీహెచ్‌ఏ(మేల్)గా పని చేస్తున్నారు. వీరిలో ఏడుగురు ఎస్సీ ఉద్యోగులను విధుల నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు, ఉద్యోగాల నుంచి అన్యాయంగా తొలగించడంపై విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ నియమాకాల్లో అనర్హులను తొలగించాలని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు గతేడాది తీర్పునివ్వగా డీఎస్సీ ద్వారా నియమితులైన తమను తొలగించడం అన్యాయమని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాలు అందజేశారు.

కార్మిక చట్టాలను కాపాడుకోవాలి

ఉంగుటూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులు కాపాడుకోవాలని సి.ఐ.టీ.యు. మండల మహాసభ తీర్మానించింది. సోమవారం స్థానిక కమ్యూనిటీ హాల్లో మెంటే జానకి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు మహా సభ జెండాను ఎగుర వేశారు. మహాసభలో నారపల్లి రమణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉంగుటూరు మండల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా సీరా అప్పారావును ఎన్నుకున్నారు. కో కన్వీనర్‌గా కోటి సరస్వతి, పేజ్ రమాదేవి, ఎం.భారతి, జాజుల కనకమహాలక్ష్మి, దార వెంకట్రావు, వల్లూరి శ్రీనివాస్, తదితరులు ఎన్నికయ్యారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

క్యాన్సర్‌పై వైద్యులకు ప్రత్యేక శిక్షణ

ఏలూరు క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఏలూరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఎన్‌సీడీసీడీ 4.0 సర్వేలో భాగంగా సోమవారం క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పిస్తూ దానికి సంబంధించిన శిక్షణ పీహెచ్ మెడికల్ ఆఫీసర్లకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రెస్ట్ క్యాన్సర్ సర్వైకల్ క్యాన్సర్‌లలో శిక్షణనిచ్చారు.ఈ కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ కలెక్టర్, డీఎం అండ్ హెచ్‌వో ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ శిక్షణలో టీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేంద్రకృష్ణ, డాక్టర్ హెలీనా, డాక్టర్ అరవింద్, పీహెచ్‌సీ డాక్టర్లు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు భౌతిక కాయం దానం



నివాళులర్పిస్తున్న మానవత సభ్యులు

కామవరపుకోట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ డైరెక్టర్, తడికలపూడికి చెందిన మద్రి సుధాకరరావు సతీమణి అలివేలు మంగా కుమారి సోమవారం తెల్లవారు జామున అనారోగ్యంతో తన నివాసంలో మృతి చెందారు. మంగాకుమారి మూడేళ్ల క్రితమే తాను చనిపోయిన తరువాత తన పార్థివ దేహాన్ని ఆశ్రం ఆసుపత్రిలోని మెడికల్ కాలేజీలో విద్యార్థులకు రీసెర్చి నిమిత్తం అంగీకరించి స్వచ్ఛందంగా అగ్రిమెంట్ చేశారు. ఈ మేరకు మంగాకుమారి పార్థివ దేహాన్ని సోమవారం వారి కుటుంబ సభ్యులు ఆశ్రం ఆసుపత్రి మెడికల్ కాలేజీకి అందజేశారు. మంగాకుమారి పార్థివ దేహంపై తొలుత మానవత అధ్యక్షులు పావులూరి చంద్రలాల్‌గాంధీ, ఏఎంసీ మాజీ చైర్మన్ తూతా లక్ష్మణరావు, నెక్కలపూడి సురేష్‌బాబులు పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పార్థివ దేహాన్ని ఆశ్రం ఆసుపత్రికి తరలించారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : సమాజంలో పేద మహిళలను వేధింపులకు గురిచేస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పుణ్యమూర్తులవారివీధిలో ఉన్న అన్నేఅనసూయమ్మ భవనంలో ఐద్వా ఏలూరు నగర మహాసభను పి.హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. నగర మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించి మహిళా సంఘం అభివృద్ధిపై, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అధిక వడ్డీలు చెల్లించలేక మైక్రో కంపెనీ వేధింపులు, అవమానాలకు మహిళలు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పోలీసులు జోక్యం చేసుకోవాలని కోరారు. ఐద్వా నాయకులు పి.అరుణకుమారి, జె.హరీషా, దుర్గ, రజనీ, షమీమా పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పట్టిసీమ ఫెర్రీ రేవు

పోలవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా వచ్చిన భారీ వరదలకు పట్టిసీమ ఫెర్రీ రేవు ప్రమాద స్థాయిలో కోతకు గురైంది. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రానికి రాకపోకలు సాగించే రేవులో పాత సచివాలయ భవనం, గ్రామ రెవెన్యూ కార్యాలయం, పాత పంచాయతీ కార్యాలయం భవనాలకు కుడివైపున ఉన్న పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి విడుదలవుతున్న కొండవాగుల దాటికి గట్టు క్రమక్రమంగా కోతకూ గురవుతూ భవనాల వద్దకు చేరుకుంది. ఈ ఏడాది వరదల సీజను పూర్తయ్యేలోపు మరింత కోతకు గురయితే భవనం పూర్తిగా అవుట్ ఫాల్ స్లూయిజ్ స్పిల్‌వేలోకి పడిపోయే ప్రమాదం ఉంది. ఫెర్రీ రేవులో ఎడమ వైపు ఉన్న శ్రీ రామకృష్ణ గీతాశ్రమం వైపు కూడా గట్టు కోతకు గురవుతూ ఆశ్రమ ఆవరణలో ఉన్న శివుడి విగ్రహం వరకూ చేరుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి ఏటా మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంలో జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ చైర్మన్లు కోతకు గురవుతున్న గట్టు పరిస్థితిని సమీక్షించి ప్రత్యామ్నాయ పరిస్థితుల గురించి ఆదేశాలు జారీ చేస్తున్నారే తప్ప ఆచరణలో చూపిన దాఖలాలు కానరావడం లేదు. అఖండ గోదావరి రివర్ బండ్ అధికారులు ఏటి గట్టు పటిష్టత విషయంలో చర్యలు తీసుకుని గండ్లు పూడ్చి రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన ఒడ్డు.. ప్రమాదకరంగా భవనం



నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు



భూ సమస్యల పరిష్కారానికి ధర్నా చేస్తున్న దృశ్యం



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు

మా గోడు వినండి మహాప్రభో..

ఏలూరులో పలు సంఘాల ఆందోళనలు
కలెక్టర్ వెట్రిసెల్వీకి వినతి

ఏలూరు రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నిరకాల భూ సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. జిల్లాలోని భూ సమస్యలను ఎదుర్కొంటున్న గిరిజనులు, దళితులు, పేదలు, పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ముఖ్య వక్తగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.ఎం.నాగమణి, సభ్యులు డీఎన్వీడీ ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్ మాట్లాడారు.

దివ్యాంగులకు న్యాయం చేయాలి..

దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎం.నాగభూషణం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో ధృవీకరణ పత్రాల్లో దివ్యాంగ శాతం ఎక్కువగా ఇచ్చి పరిశీలనలో తగ్గించడం వల్ల చాలా మంది పింఛన్‌కు అర్హత కోల్పోయారన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి అర్హులందరికీ పింఛన్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి..

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.మనోజ్, కె.లెనిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే 14 నెలలు గడుస్తున్నా కనీసం విద్యార్థులకు ఇచ్చిన హామీలు, విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.పవన్ నగర ఉపాధ్యాక్షులు ఎం.జయంత్, ఎం.శివ, ఎస్ రాజ బాబు, ఎస్ సూర్య పాల్గొన్నారు.

నిర్వాసిత రైతుల ఆందోళన

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని, సర్వీస్ రోడ్లు నిర్మాణం చేయాలని, పరిహారం పెంచి ఇవ్వాలని, 2013భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు ధర్నా నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి వినతి పత్రం అందజేశారు. గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం అధికారుల బృందం పర్యటన చేసి రైతుల సమస్యలపై నివేదిక ఎందుకు ఇవ్వలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత జరిగిన ధర్నానుద్దేశించి జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 4న జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను హైవే అథారిటీ అధికారులు, భూసేకరణ అధికారులు తుంగలో తొక్కడం దారుణమన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు లేకపోవడం వలన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వందనపు సాయిబాబా, గోలి నర్సిరెడ్డి, కె.పిచ్చిరెడ్డి, జి.లక్ష్మీరెడ్డి, ఇర్ల శ్రీనివాస్ రెడ్డి, డి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

కామవరపుకోటలో మోటార్ సైకిళ్ల ర్యాలీ

కామవరపుకోట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లను తొలగించడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ వైసీపీ చింతలపూడి నియోజకవర్గం కన్వీనర్ కంభం విజయరాజు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కామవరపుకోటలో మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వైసీపీ మండలాధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ, తడికలపూడి సొసైటీ మాజీ చైర్మన్ జి.రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి..

కుక్కునూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలంలో ఏడాది క్రితం మూతపడిన అమరవరం సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పునఃప్రారంభించాలని సోమవారం పూర్వ విద్యార్థులు ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో అమరవరం సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉండి విద్యనభ్యసించి ఎంతోమంది విద్యార్థులు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నత ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఇప్పుడు వారంతా ఒక టీమ్‌గా ఏర్పడి వసతిగృహాన్ని మళ్లి పునఃప్రారంభించాలని కోరుతున్నట్లు తెలిపారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్ రెడ్డికి వసతిగృహాన్ని ప్రారంభించాలని సిపార్సు చేశారు. పూర్వ విద్యార్థులు రెంటాల వెంకట్, కంబళ్లకన్నయ్య, సి.హెచ్. కాంతారావు, చిట్టిబాబు, శనగ వెంకటేశ్వర్లు, బుయ్యని నాగేశ్వరరావు, రామచంద్రరావులు పాల్గొన్నారు.



మట్టి ప్రతిమలను విక్రయిస్తున్న దృశ్యం



విక్రయానికి సిద్ధంగా ఉన్న గణపతి ప్రతిమలు

మట్టి గణనాథుల వైపే మొగ్గు

ముస్తాబవుతున్న మండపాలు - ఊరేగింపుగా తీసుకెళ్తున్న కొనుగోలుదారులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు క్షేత్రం ముస్తాబవుతోంది. మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో దాదాపు 12చోట్ల ఈ ఉత్సవాలు నిర్వహిస్తుండగా, ఇప్పటికే మందిరాలను ఆకర్షణీయంగా నిర్మించి ముస్తాబు చేస్తున్నారు. పలు చోట్ల భారీ మందిరాలను నిర్మించారు. బుధవారం ఉదయం భారీ ఊరేగింపుతో గణపయ్య విగ్రహాలను ద్వారకా తిరుమలకు తెచ్చి మందిరాల్లో ప్రతిష్ఠించనున్నారు. ద్వారకాతిరుమల పసరుకోనేరు సెంటర్‌లో మట్టి విగ్రహాలు, పాలవెల్లులు, గొడుగుల అమ్మకాలు ఊపందుకుంటున్నాయి. ఒక్కో విగ్రహం సైజును బట్టి రూ.50 నుంచి రూ.150 వరకూ విక్రయిస్తున్నారు.

శిబిరాలకు తరలుతున్న గణనాథులు..

చింతలపూడి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చవితి పండుగ కోసం గ్రామగ్రామాన శిబిరాలు ఏర్పాటవుతున్నాయి. చంద్రగ్రహణం కారణంగా మార్పులు రావడంతో విగ్రహాలు అమ్మే శిబిరాల వద్ద తరలింపు జోరు పెరిగింది.చింతలపూడి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ, సరిహద్దులోని గ్రామాల నుంచి వస్తున్నారు. విగ్రహాలు 200 నుంచి రూ.35 వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి.

350 మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



మట్టి ప్రతిమలు అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో పర్యావరణానికి హాని చేయని మట్టి గణపతి ప్రతిమలనే వాడాలని విద్యారోహిణి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కొండేపాటి రామకృష్ణ ప్రజలకు సూచించారు. సోమవారం పాఠశాలలోని విద్యార్థులకు గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. సుమారు 350 గణపతి ప్రతిమలను పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ నీరజ, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న యూరియా పట్టివేత



యూరియాను స్వాధీనం చేసుకున్న అధికారులు

టి.నర్సాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా యూరియా తరలిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్టు వ్యవసాయాధికారి హబీబ్ బాషా తెలిపారు. ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న క్రమంలో మక్కినవారిగూడెం నుంచి బండివారిగూడెం రహదారిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా యూరియా తరలిస్తున్నారనే సమాచారంతో వ్యవసాయ శాఖ సిబ్బందితో సోమవారం దాడులు నిర్వహించి 50 బస్తాల యూరియా స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదైనట్టు తెలిపారు. ఎరువులకు కృత్రిమ కొరత సృష్టిస్తే సహిం చేదిలేదని హెచ్చరించారు. ఈ దాడుల్లో మండల వ్యవసాయ శాఖాధికారిణి ప్రియాంక, వీఏఏపీఎస్‌వీ మధు పాల్గొన్నారు.

ముస్లింలు విద్యనభ్యసించాలి



విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న జేఏసీ సభ్యులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యతోనే అన్నిరంగాల్లో విజయం సాధించగలుగుతామని ముస్లిం జేఏసీ సభ్యుడు షేక్ ముస్తఫా సూచించారు. సోమవారం పట్టణంలోని పదిహేడు ప్రభుత్వ పాఠశాలల పరిధిలో చదువు మధ్యలోనే మానేసిన ముస్లిం విద్యార్థుల వివరాలను జేఏసీ సభ్యులు నాలుగు టీములుగా ఏర్పడి సేకరించారు. ఈ సందర్భంగా స్థానిక బాలాజీ నగర్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ముంతాజ్ బేగం పాఠశాలకు రావడం లేదని తెలుసుకుని ఆ పాఠశాల హెచ్‌ఎం గంగరాజుతో కలిసి విద్యార్థిని ఇంటికివెళ్లి ఆమె తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలకు పంపినట్లు ముస్తఫా తెలిపారు. పట్టణ, మండల పరిధిలో ఉన్న ముస్లిం కుటుంబాలకు చెందిన విద్యార్థులకు సమస్యలుంటే తెలియజేయాలని ముస్తఫా తెలిపారు. సహకరించిన ఎంఈఓ-1 రాముడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. షేక్ పీరూ సాహెబ్, షేక్ యాకూబ్, షేక్ నజీర్, షేక్ సలీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

చింతలపూడి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన అవసరమని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు అన్నారు. నాగిరెడ్డిగూడెం గురుకుల బాలికల పాఠశాలలో బాల్య వివాహాలు, గర్భదారణ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, తల్లీబిడ్డ మరణాలు సంభవిస్తాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే మహిళలు పూర్తి ఆరోగ్యంతో ఉంటారన్నారు. ఐసీడీఎస్ పీవో టి.సత్యవతి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.క్రాంతికుమార్, ఎంఈవో కిరణ్ బాబు, ఎం.డి.అక్బర్ అలీ, ప్రిన్సిపల్ హేమలత పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పెదవేగి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గం సమన్వయ కమిటీ సమయంలో పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై నాయకులకు ఎమ్మెల్యే ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నమ్మకానికి అనుగుణంగా వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులను నిర్విఘ్నంగా పూర్తి చేసిందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను పార్టీ శ్రేణులు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ఆయన సూచించారు. దెందులూరు ఏఎంసీ చైర్ పర్సన్ గారపాటి రామసీత, సొసైటీ అధ్యక్షులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, కొనరాజు వరప్రసాద్, పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్ ప్రసాద్, లావేటి శ్రీనివాస్, మాగంటి నారాయణ ప్రసాద్, నంబూరి నాగరాజు, కమ్మ శివరామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళకు వీల్ చైర్ అందజేత



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగురాలైన గుర్రం శాంతికి సోమవారం వీల్ చైర్ అందజేశారు.ఇటీవల మృతి చెందిన మహ్మద్ అన్వర్ పాషా సతీమణి సుధాలక్ష్మి పాషా జ్ఞాపకార్థం ఈ వీల్ చైర్ అందజేశారు. మానవత సభ్యులు దారా సురేష్ గుప్తా, మానవత సెంట్రల్ కమిటీ కన్వీనర్ త్రిపుర రమేశ్, గద్దే సత్య నారాయణ, కర్పూరం వెంకన్న బాబు, పల్లె వెంకట రెడ్డి పాల్గొన్నారు.

విలీన మండలాలను పట్టించుకోండి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరులో జరిగిన పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. జూన్, జూలైలో నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత అధికంగా ఉందని సూర్యకిరణ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఉంగుటూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల నిమిత్తం బాదంపూడి రూరల్ ఫీడర్‌కు విద్యుత్ సరపరా నిలుపుదల చేస్తున్నట్టు ఈ.ఈ. కే.ఎం.అంబేడ్కర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్య రావులపర్రు, రాచూరు, సీతారాంపురం గ్రామాల చేపల చెరువులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

పెదవేగి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జానంపేటలో అనారోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న బాధితులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనివార్య కారణాలతో ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని పొందలేని బాధితులకు సీఎం సహాయ నిధి పథకం అండగా నిలుస్తుందన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు,పార్టీ నాయకులు జయబాబు, ఏసు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఏలూరు రూరల్, ఆగస్టు 25, (ఆంధ్రజ్యోతి) : స్థానిక 16వ డివిజన్ సీనియర్ తెలుగుదేశం పార్టీ పిలగల ప్రకాశరావు దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆ డివిజన్‌లోని గంగానమ్మ మున్సిపల్ పాఠశాలకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులకు రూ.10వేలు వెచ్చించి రాత పుస్తకాలు, విద్యా సామాగ్రిని అందజేశారు. ఈకార్యక్రమానికి యూడా చైర్మన్ పెద్దిరెడ్డి శివప్రసాద్, కార్పొరేటర్ చోడే వెంకటరత్నం, ఆర్పిఏ సభ్యులు ఎంఆర్‌డి బలరాం చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులకు భవిష్యత్‌లోనూ అండగా ఉంటాననీ పిలగల ప్రకాష్ తెలిపారు. ఈకార్యక్రమంలో దివాకర్, కే శ్రీను, ఉస్మాన్, సుధాకర్, జగదీష్, సత్యవతి, గంగరాజు, రాఘవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా నిల్వలపై తనిఖీలు

చింతలపూడి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని యూరియా నిల్వలపై జిల్లా వ్యవసాయాధికారులు సోమవారం తనిఖీలు జరిపారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తూ కొన్ని సూచనలిచ్చారు. వరి రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పట్టాదారు పాస్‌పుస్తకాలు సరి చూసుకుని రైతులకు ఒకటి, రెండు బస్తాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. రైతులు కూడా ఎక్కువ నిల్వలు పెట్టుకోరాదని, కృత్రిమ కొరత వలన ఇతరులకు అందకుండా పోతుందని అవసరమైన మేర తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట సహాయ సంచాలకులు వైసుబ్బారావు, ఏవో మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖాధికారుల సూచనలు

ఉంగుటూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ గెలల కోసే కార్మికులు విద్యుదాఘాతం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆ శాఖ ఈ.ఈ. కే.ఎం.అంబేడ్కర్ తెలిపారు. దీనిపై గొల్లగూడెం సబ్ స్టేషన్‌లో సోమవారం రైతులు, కూలీలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డి.ఈ.ఈ.రాళ్లపల్లి భీమేశ్వర రావు, ఏ.ఈ.లు.జే.ఈ.లు వివిధ శాఖల అధికారులు, హార్టీకల్చర్, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.టి.డి.పి. మండలాధ్యక్షులు వేముల పల్లి సుధీర్ పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఏలూరుటూటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టైలరింగ్, జూట్‌బ్యాగుల తయారీలో మహిళలకు ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికుమార్ తెలిపారు. అభ్యర్థులు 18 - 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. టైలరింగ్‌లో 31 రోజులు, జూట్ బ్యాగుల తయారీలో 14రోజుల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తైన వారికి సర్టిఫికెట్‌తో పాటు ముద్రలోన్‌కు సిపార్సు చేస్తామన్నారు. వివరాలకు 99485 65256, 95027 23561ను సంప్రదించాలన్నారు.

మట్టి ప్రతిమలనే వాడాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 25, (ఆంధ్రజ్యోతి) : కాలుష్య నియంత్రణ మండలి ఏలూరుశాఖ పర్యవేక్షణలో వినాయక చవితి పండుగను పర్యావరణ హితమైన పండుగగా జరుపుకోవాలని, కేవలం మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమలను మాత్రమే వాడాలని, పిఒపి తో చేసిన విగ్రహాలను వాడకూడదని, కోరుతూ సోమవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో కళాకారులు కళాజాత నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులని నిషేధించాలని పరిసర పరిశుభ్రత పాటించాలని తదితర అంశాలపై ఎం.శ్రీదివ్య కల్చరల్ కళాజాత బృందం కళాకారులు ఎం కుమార్, ఎం తిరుపతి కళాజాత నిర్వహించారు.

అరకు పరిశీలకుడిగా చంటి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అరకు టీడీపీ పార్లమెంటరీ పార్టీ విస్తృతస్థాయి సమావేశం విశాఖ పట్నంలో సోమవారం జరిగింది. అధిష్ఠానం పరిశీలకులుగా నియమించిన ఏలూరు ఎమ్మెల్యే చంటి సమావేశానికి హాజరయ్యారు.అరకు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులుగా ఎవర్ని నియమించాలనే విషయంపై విస్తృతంగా ఈ సమావేశంలో చర్చించారు.

అక్రమంగా స్థలం రిజిస్ట్రేషన్

దెందులూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక లైబ్రరీ సెంటర్‌లో ఉమ్మడి సరిహద్దుగా 1994 నుంచి ఉపయోగిస్తున్న 100 గజాల స్థలాన్ని అక్రమంగా సర్వే యర్‌తో కొలిపించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు శింగర రామ చంద్రరాజు కలెక్టరేట్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. గత 30 ఏళ్లుగా ఉమ్మడి దారిగా వినియోగిస్తున్న స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అర్హులందరికి పింఛన్లు అందిస్తాం : మంత్రి పార్థసారథి

నూజివీడు టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రీవెరిఫికేషన్‌లో పింఛన్లు కోల్పోయిన వారిలో అర్హులు ఉంటే తిరిగి అందేలా చర్యలు చేపడుతున్నట్టు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మండల, మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పింఛన్ల తొలగింపు నేపథ్యంలో పునరుద్ధరణకు సంబంధించి అధికారులు పారదర్శకంగా పనిచేయాలన్నారు. పింఛన్లు కోల్పోయిన వారిలో ఎంతమంది అర్హులు ఉన్నారో సమగ్ర నివేదిక అందించాలన్నారు. మండల, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ముదినేపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ శాఖ ప్రకృతి విభాగం అధికారులు, సిబ్బంది పెదగొన్నూరులో ప్రకృతి వ్యవసాయ విధానంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రోగ్రామ్ ఇన్‌చార్జి గౌతంకుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టుబడి తగ్గడంతో పాటు రసాయనాలు లేని ఆహార దిగుబడులు సాధించవచ్చన్నారు. వరిని పలు రకాల పురుగుల ఉధృతి నుంచి కాపాడేందుకు పొలాల్లో పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలన్నారు. పెదగొన్నూరు డీసీ చైర్మన్ జి.సురేష్, పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలకు ప్రభుత్వం కృషి



సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు/ముదినేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పేదలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం వరహాప ట్నంలో సీఎం సహాయనిధి చెక్కులను నలుగురికి పంపిణీ చేశారు. మండవల్లి మండలం గన్నవరానికి చెందిన బైలపాటి నాంచారమ్మ రూ.లక్ష, భాస్కరరావుపేటకు చెందిన వేటుకూరి సూరపురాజు రూ.1,25,722, పెయ్యేరు గ్రామానికి చెందిన దేశర్ల రవితేజ రూ.35వేలు, కొండంగికి చెందిన కొల్లాటి ఎనోషా రూ.16వేలు నలుగురికి కలిపి రూ.42,76,722 సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. నీటిసంఘం అధ్యక్షుడు కూనపురెడ్డి వెంకటబాల కోటేశ్వరరావు, గంజల శ్రీనివాసరావు, టేకు రమేష్, కూటమి నేతలు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు అధిక ప్రాధాన్యం

ముదినేపల్లి:వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతుల్లో ఆధునిక శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని పెంచేందుకు రాష్ట్రంలో ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కైకలూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ హామీల అమలు కమిటీ చైర్మన్ డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి మండలం కోడూరు గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో జనార్దనస్వామి జేఎల్‌జీ గ్రూపు సభ్యులైన రైతులకు వ్యవసాయ శాఖ 80 శాతం సబ్సిడీపై మంజూరు చేసిన కిసాన్ డ్రోన్‌ను ఆయన అందజేశారు. సర్పంచ్ అడుసుమిల్లి కృష్ణకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని జగన్మోహనరావు, టీడీపీ నాయకులు ఎర్నేని కిషోర్, చలసాని జగన్మోహనరావు, కోడూరు శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

30 వినాయక విగ్రహాల పంపిణీ



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న దాతలు

మండవల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో 30 వినాయక విగ్రహాలను భైరవపట్నం గ్రామం ఎన్డీయే పార్టీ కార్యాలయంలో సోమవారం దాతలు చాపరాల దుర్గాప్రసాద్, చాపరాల నాగేశ్వరరావు, సజ్జా సురేష్‌బాబు పంపిణీ చేశారు. మండలంలోని 29 గ్రామాలకు విగ్రహాలను అందించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రజలందరూ వినాయకచవితి భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. చవితి పందిళ్ల నిర్వాహకులకు పోలీసులు అనుమతి తప్పనిసరి అని కమిటీ సభ్యులకు మండవల్లి ఎస్‌ఐ సీహెచ్ రామచంద్రరావు సూచించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న కనుమూరి రంగరాజు

కైకలూరు, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం గోపవరంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు యూనిఫాంను గ్రామానికి చెందిన కనుమూరి పాండు రంగరాజు అందజేశారు. సోమవారం గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు యూనిఫాంలను గత పదేళ్లుగా ఆయన సొంత నగదుతో అందిస్తున్నారు. వీటితోపాటు ప్రభుత్వ పాఠశాల ఆవరణ మెరక చేసేందుకు వంద ట్రక్కుల మట్టిని తోలించడం. స్కూల్ గేటును సొంత నిధులతో ఏర్పాటుచేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచరు పి. సుజాత వారిని ఘనంగా సత్కరించారు. పాఠశాలకు అవసరమైన నాలుగు కుర్చీలు గ్రామ సర్పంచ్ ఉలిసి వసంతకుమారి బహూకరించారు.

చర్చి నిర్మాణానికి నగదు, సామగ్రి వితరణ

ముసునూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గుడిపాడు ఎస్సీ కాలనీలో సగం పూర్తయిన షాలేము చర్చి నిర్మాణానికి రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి నగదు, సామగ్రిని వితరణ చేశారు. మంత్రి అందజేసిన రూ.20వేలు నగదు, సిమెంట్, ఇతర సామగ్రిని సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు చర్చి నిర్వాహకులకు అందజేశారు. మధ్యలోనే నిలిచిన చర్చి నిర్మాణాన్ని మంత్రి సారథి దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే నగదు, సామగ్రి ఇచ్చి చర్చి నిర్మాణం పూర్తిగా చేయాలని కోరినట్లు రఘుబాబు తెలిపారు. చర్చి నిర్మాణానికి సహకారం అందించిన మంత్రికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు మందలపు ధర్మరాజు పాల్గొన్నారు.

ఆలయ అర్చకుడికి నెలకు రూ.10వేలు మంజూరు

లోపూడిలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ధూప దీప నైవేద్యం నిమిత్తం అర్చకుడికి నెలకు రూ.10వేలు నగదును మంత్రి కొలుసు పార్థసారథి మంజూరు చేయించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు విజయవాడలో మంత్రిని కలిసి సన్మానించి, రాధాకృష్ణుల చిత్రపటాన్ని బహూకరించారు. నాయకులు పేరం గంగరాజు, లక్కపాము కాంతరావు, నక్కా చెన్నారావు, పేరం వెంకటరత్నం, పొన్నగంటి రంగరావు తదితరులు పాల్గొన్నారు.

బాలరావమ్మ హుండీల ఆదాయం రూ.1.81 లక్షలు



హుండీల సొమ్ము లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

ఆగిరిపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : తోటపల్లి గ్రామంలోని దుర్గిరాల బాలరావమ్మకు భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం నూజివీడు గ్రూప్ దేవాలయం కార్యనిర్వహణాధికారి అలివేలు, ఈవో సీహెచ్ సాయి ఆధ్వర్యంలో హుండీల సొమ్ములను లెక్కించారు. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో రూ.1,81,330 వచ్చినట్లు ఈవో తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మండవ రామకృష్ణ, కమిటీ సభ్యులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు యూరియా అమ్మితే చర్యలు

» సబ్ కలెక్టర్ వినూత్న

ఆగిరిపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువుల డీలర్లు యూరియాను నిల్వ చేసి అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ బి.వినూత్న హెచ్చరించారు. సోమవారం ఆగిరిపల్లిలోని ఎరువులు దుకాణాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత ఆమె ఎరువుల దుకాణంలోని స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా అమ్మకాలను మొదటిగా మండలంలోని రైతులకే ప్రాధాన్యత ఇవ్వాలని డీలర్లకు సూచించారు. యూరియా అమ్మకం జరిపేటప్పుడు ఎటువంటి ఇతర ఉత్పత్తులను ముడిపెట్టి అమ్మరాదని అవసరమైతే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నూజివీడు ఏడీఏ జి విద్యాసాగర్, తహసీల్దార్ పీఎన్వీ ప్రసాద్, మండల వ్యవసాయాధికారిని భవాని పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230
నెక్ కోడి గుడ్డు ధర	(100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

అక్షర విజయం

'ఆంధ్రజ్యోతి' అక్షరం అజెండాలో సమస్యలు విన్నారు.. పరిష్కరించారు

» నూజివీడులో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు

» రూ.200 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు డీపీఆర్

» పట్టణంలో 'ఆంధ్రజ్యోతి' సక్సెస్ మీట్



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ

నూజివీడు,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో ఈ ఏడాది జనవరి 28వ తేదీన ప్రజా సమస్యలపై 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా వినూత్నమైన కార్యక్రమాన్ని ఆంధ్రజ్యోతి నిర్వహించింది. ఈ సందర్భంగా అక్షరం అజెండాలో మున్సిపల్ అధికారులు సమస్యలు విన్నారు.. పరిష్కరించారు. నూజివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన సభ నిర్వహించి, నూజివీడు మునిసిపల్ ప్రజలను ఆహ్వానించింది. అక్కడ సమస్యలన్నీ చైర్‌పర్సన్ విన్నారు. వాటిని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లేందుకు ఆంధ్రజ్యోతి తనవంతు పాత్రను పోషించింది. అనంతరం సమస్యల పరిష్కారానికి మంత్రి పార్థసారథి తనదైన శైలిలో కృషిచేశారు. నూజివీడు పట్టణాన్ని ముంపునకు గురిచేసిన పెద్దచెరువు గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ఆదేశించారు. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో పెద్దచెరువు గండ్లను పూడ్చటమే కాక చెరువుకట్టను అభివృద్ధి పరిచారు. ఇవేకాక మరో రూ.8 కోట్ల వరకు నిధులను మంజూరు చేయించి ప్రజలు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు కేటాయించారు. దీనిలో భాగంగానే నూజివీడు సంగం కాంప్లెక్స్‌లో 'ఆంధ్రజ్యోతి' సోమవారం సాయంత్రం 4 గంటలకు తణుకు యూనిట్ ఎడిషన్ ఇన్‌చార్జి రామకృష్ణ అధ్యక్షతన సక్సెస్ మీట్ నిర్వహించింది. ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ హాజరై మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో నిర్మాణాత్మకమైన పాత్రను ఆంధ్రజ్యోతి పోషించిందన్నారు.



అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు : పగడాల

నూజివీడు మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ సీఆర్‌డీఏ నిధుల కింద నూజివీడు పట్టణంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులకు సమానంగా అభివృద్ధి పనులను కేటాయించా మన్నారు. పట్టణంలోని 32 వార్డుల్లో రహదారుల అభివృద్ధి, డ్రెయిన్‌ల నిర్మాణం చేపడతామన్నారు. గత జనవరిలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన సదస్సులో ప్రజలనుంచి వచ్చిన సమస్యల్లో దాదాపు 80శాతం సమస్యలు పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నాయన్నారు. కోతులు, కుక్కల బెడద ఉన్నా కొన్ని సాంకేతిక పరమైనటువంటి అంశాలతో వాటిని పరిష్కరించలేని పరిస్థితి నెలకొందన్నారు. పట్టణంలో పలు రహదారుల అభివృద్ధికి బీటీ వర్క్ నిర్వహించేందుకు రూ.80లక్షల వ్యయంతో అంచనాలు సిద్ధం చేశామని, త్వరలో అభి వృద్ధి పనులు చేపడతామన్నారు. సమ్మర్ స్టోరేజి ట్యాంక్ నిర్మాణంకు సంబంధించి స్థల సేకరణకు చర్యలు చేపట్టామన్నారు. జాతీయ స్థాయిలోనే నూజివీడును మణిహారంగా తీర్చేదిశగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.200 కోట్లతో డీపీఆర్‌ను కేంద్రానికి పంపించామన్నారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో పనులు ముందుకు సాగి.. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజి వ్యవస్థ, రింగ్ రోడ్లు ఏర్పాటయితే నూజివీడు అభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు.

రహదారుల విస్తరణ జరగాలి : నూతక్కి



నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు నూతక్కి వేణుగోపాలరావు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి అక్షర సమరంతో మున్సిపాల్టీలోని ప్రతి సమస్యకు ఒక్కొక్కటిగా పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారు. ఆంధ్రజ్యోతికి ప్రజాపక్షం గొంతుక ఉండడం వల్లే ఇది సాధ్యం. నూజివీడు పట్టణం అభివృద్ధి చెందాలంటే వ్యాపారరంగం ముందడుగు వేయాలి. మెగా మాల్స్ వచ్చి చిరువ్యాపారులు దెబ్బతిన్నారు అనడం సరికాదు. జమిందారీ కాలం నాటి రోడ్లు, విస్తరణ జరగకపోవడం వల్లే పార్కిం గ్ సమస్య, ట్రాఫిక్ సమస్యతో వ్యాపారాలు అభివృద్ధి చెందడం లేదు. రహదారుల విస్తరణ జరిగితే అన్ని వ్యాపారాలు గాడినపడతాయి. మంత్రి కొలుసు పార్థసారథి పట్టణంలో ఇండోర్ స్టేడియానికి రూ.కోటి 75 లక్షలు మంజూరు చేయించి, వాడుకలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి చొరవతో సమస్యల పరిష్కారం : నాగరాణి



నూజివీడు పట్టణ భారతీయ జనతాపార్టీ అధ్యక్షురాలు ఎం.నాగరాణి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి చొరవతో అనేక సమస్యలు పరిష్కారమయ్యేదిశగా అడుగులు పడ్డాయని, అయితే పలు అవసరాలరీత్యా నూజివీడు పట్టణానికి వస్తున్న ప్రజలు టాయ్‌లెట్‌కు వెళ్లేదుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, ప్రధానంగా మహిళలను దృష్టిలో పెట్టుకుని నూజివీడు పట్టణంలో పబ్లిక్ టాయ్‌లెట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరత ఉందన్నారు.

● ఆంధ్రజ్యోతి తాడేపల్లిగూడెం యూనిట్ బ్రాంచి మేనేజరు హరిబాబు మాట్లాడుతూ 'అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా కార్యక్రమం' ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య ఆలోచనల నుంచి పురుడు పోసుకుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొట్లాది రూపాయలతో ముడిపడి ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రజ్యోతి కృషి చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 కేంద్రాల్లో సదస్సులు నిర్వహించి, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం దిశగా విజయం సాధించగలిగామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి జీవీఎస్ఎన్ రాజు, యాడ్స్ మేనేజర్ రాజు, నూజివీడు మున్సిపల్ ఏఈ వంశీ అభిషేక్, టీపీవో కె.వెంకటేశ్వర రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఆర్ఐ ఆర్.సందీప్, ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనూ సదస్సులు నిర్వహించాలి



'అక్షరం అండగా.. పరిష్కారం అజెండా' సక్సెస్ మీట్ అంటే కార్యక్రమా నికి హాజరయ్యా. దాదాపు 8 నెలల క్రితం నిర్వహించిన సదస్సులో ప్రస్తావించిన అంశాలకు పరిష్కారా లను ఆంధ్రజ్యోతి చూపగలిగింది. ఇటువంటి సదస్సులు పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏర్పాటుచేస్తే అభివృద్ధి చెందుతాయి. పట్టణంలో మొగలిచెరువు కాలుష్యానికి నిలయంగా మారుతోంది. దానిని శుభ్రపరిచి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తే బాగుంటుంది.

- కిశోర్, సుంకొల్లు, నూజివీడు మండలం

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి



నూజివీడు పట్టణంలో ఐదు గంటలు దాటితే రోడ్లపై వాహనం నడపాలంటే కత్తిమీద సామే. సమస్య పరిష్కారానికి రహదారుల విస్తరణతో పాటు నూజివీడులో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. పట్టణంలో కోతులు, కుక్కల బెడద అధికంగా ఉంది. రూ.లక్షతో ఇంటికి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాం. నిరుపేదల పరిస్థితిని అర్థం చేసుకుని మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలి.

- కె.ప్రభాకర్, విశ్రాంత ఆంధ్రా బ్యాంకు మేనేజర్

మనిషి ప్రాణం కంటే జంతువులే ముఖ్యమా ?



జంతు ప్రేమికులు, కుక్కలు, కోతులకు హానిచేయకూడదని సూచిస్తున్నారు. అటువంటప్పుడు కోళ్లను, మేక మాంసాన్ని ఏవిధంగా విక్రయిస్తున్నారు ? మనుషుల ప్రాణంకంటే జంతువుల ప్రాణమే ముఖ్యమా? దీనిపై పూర్తిస్థాయిలో జంతు ప్రేమికులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. దీనికి ప్రతి ఒక్కరం సిద్ధంగా ఉండాలి.

- టి.లాజరస్, నూజివీడు

కొన్ని సూచనలతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం



నూజివీడు పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను కొన్ని సూచనలతో పరిష్కరించవచ్చు. ప్రధానంగా వాహనాలు నిలుపుదల చేస్తున్న ప్రదేశాలను కొద్దిగా మార్పుచేస్తే ఆ సమస్యను అధికమించవచ్చు. దీనికి సంబంధించి పోలీస్, ఆర్టీసీ, ఆర్టీఐ, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తే బాగుంటుంది.

- నడికట్ల వెంకటేశ్వరరావు, నూజివీడు

నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా 'ఆంధ్రజ్యోతి'



ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా ఆంధ్రజ్యోతి వ్యవహరిస్తోంది. లిక్కర్ ధరలు పెంచి, విక్రయించడంపై ఆంధ్రజ్యోతి ఇచ్చిన కథనాలతో ఏకంగా ఆ శాఖ అధికారులే కదలివచ్చారు. అదేరీతిన గత 8 నెలల క్రితం నిర్వహించిన సదస్సులో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిష్కారం చూపేదిశగా ఆంధ్రజ్యోతి తీసుకున్న చొరవ అధికారుల పనితీరుకు ఈ సక్సెస్ మీటే నిదర్శనం.

- ఎం.రాజశేఖర్, నూజివీడు

'యూరియా కొరత లేకుండా చూడాలి'

ముదినేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో యూరియా ఎరువు కొరత లేకుండా చూడాలని బీజేపీ నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. సోమవారం ఉప్పరగూడెంలో బీజేపీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు బండారు పాండురంగారావు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నచ్చిరెడ్డి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ నాయకులు పెద్ది శివ, గోర్జి వెంకన్న, రైతులు నచ్చిరెడ్డి సోములు, బండారు సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు సోమవారం విలేకరులతో మాట్లాడారు. డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారేమో పరిశీలించాలన్నారు. పీఏసీఎస్‌లకు అరకొర యూరియాను కేటాయిస్తూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారని వరిపైరు ఎదుగుదలకు అవసరమైన సమయంలో యూరియా కొరత ఏర్పడడం తీవ్ర నష్టాలను కలుగజేస్తుందన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ముసునూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో ఉన్న ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీసత్యనారాయణ మోన్యూర్స్ డిపో, భాగ్యశ్రీ ఎంటర్‌ప్రైజస్ ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఏవో జి.మీరయ్య, ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్ తనిఖీ నిర్వహించారు. శ్రీసత్యనారాయణ మోన్యూర్స్ డిపోలో ఆర్గానిక్ ప్రొడక్ట్ సిటీ కంపోస్ట్, కార్బన్, కాల్షియం నైట్రేట్ నిల్వల్లో స్టాక్ రిజిస్టర్‌కు గ్రౌండ్ బ్యాలెన్స్‌లో కొన్ని వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు రూ.7,32,592 విలువైన 50.095 మెట్రిక్ టన్నుల ఆర్గానిక్ మోన్యూర్స్ స్టాక్‌కు సంబంధించిన అమ్మకాలను విజిలెన్స్ అధికారులు నిలిపివేసి, తదుపరి చర్యలపై మండల వ్యవసాయ అధికారిణికి అప్పగించారు. తనిఖీల్లో వీఆర్వో బాజీ, ఏవో ఏ.చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యోగాసన పోటీల్లో నూజివీడు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచినట్లు ఆర్జీయూకేటీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేం ద్రకుమార్ తెలిపారు. ఈనెల 21నుంచి 24వరకు తాడేపల్లిగూడెం, సరస్వతి విద్యాలయంలో యోగా పోటీలు నిర్వహించగా, ట్రిపుల్ ఐటీకి చెందిన పీయూసీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని కె.హరిత, సీనియర్స్ విభాగంలో దీపక్‌నాయుడు, ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థి అశోక్ పతకాలను సాధించారన్నారు. వీరు విజయవాడలో నిర్వహించే జాతీయస్థాయి యోగా పోటీలకు హాజరవుతారన్నారు. విద్యార్థులను ఏవో లక్ష్మణరావు, అకడమిక్ డీన్ చిరంజీవి తదితరులు అభినందించారు.



పెదగొన్నూరులో బాలకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎన్డీఏ నాయకులు, అభిమానులు

సినీ నటుడు బాలకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

ముదినేపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేరు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు (లండన్) గోల్డెన్ ఎడిషన్ నమోదై అరుదైన గౌరవం దక్కినందుకు పెదగొన్నూరు గ్రామ ఎన్డీఏ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలోని సినీ నిర్మాత, దుర్గా ఆర్ట్స్ అధినేత డాక్టర్ కేఎల్ నారాయణ స్వగృహంలో నాయకులు, గ్రామస్థులు బాలకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాలకృష్ణ సతీమణి వసుంధర తల్లి స్వగ్రామం కావడంతో అభిమానులు మరింత ఆనందోత్సాహాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు గుడివాడ వేణు, పరసా ఏడుకొండలు, యార్లగడ్డ గంగయ్య, డీసీ చైర్మన్ గుడిసేవ సురేష్, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి శివ ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు గుడిపూడి నాగరాజు, ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు బత్తుల దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు ఐకా బాల, బండి నాగబాబు హర్షం వ్యక్తం చేశారు.



నూజివీడులో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సోమవారం సీఐటీయూ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు జి.రాజు మాట్లాడుతూ ఫ్రీ బస్సు పథకం వల్ల నష్టపోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు 21ని రద్దు చేసి ఆటో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎన్నార్ హనుమాన్లు, నూజివీడు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బేకరీ కేకులో బల్లి కలకలం !

ముదినేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెంలోని ఓ బేకరీ షాపులో కొనుగోలు చేసిన కేకులో బల్లి కనిపించింది. శోభనాద్రిపాలెంకు చెందిన బత్తిన హరీష్ అనే వ్యక్తి తన సమీప బంధువుల ఇంట్లో ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకలకు సోమవారం ఆ బేకరీ నుంచి కేకును కొనుగోలు చేశాడు. సాయంత్రం కేక్ కట్ చేస్తుండగా బల్లితోక బయటపడింది. అప్పటికే ఆ చిన్నారికి కేకులోని కొంత భాగాన్ని తినిపించేశారు. కార్యక్రమానికి వచ్చిన వారు కొందరు కేకులో సగభాగాన్ని తినేశారు. వెంటనే బల్లి తోకను చూసిన అతడు మిగిలిన కేకు భాగాన్ని బేకరీకి వెళ్లి యజమానికి చూపించాడు. దీనిపై ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగిం ది. ఈ విషయాన్ని ఏలూరు ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

లే-అవుట్‌లను రెగ్యులైజేషన్ చేయించాలి

కలిదిండి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ లే-అవుట్‌ను గుర్తించి వాటిని రెగ్యులైజేషన్ చేయించాలని ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర పంచాయతీ కార్యదర్శులను ఆదేశం చారు. సోమవారం పంచాయతీ కార్యదర్శుల మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్‌లు వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి ఉండే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి రూ25 వేలు మంజూరు చేస్తున్నామన్నారు.

కొండలరావుపాలెంలో బౌన్సర్ల అరెస్ట్

నూజివీడుటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కొండలరావుపాలెంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటివద్ద చెలరేగిన ఘర్షణ నేపథ్యంలో పలువురు బౌన్సర్లను అరెస్ట్ చేశామని నూజివీడు డీఎస్పీ ఎంవీవీఎస్. ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈనెల 21న చెరువులీజు విషయమై వైసీపీ నాయకులు కొందరు బౌన్సర్లను తీసుకువచ్చి ఘర్షణలకు పురికొల్పగా శాంతి భద్రతలకు విఘాతం కలిగింది. ఈ నేపథ్యంలో ఎనిమిది మందిని దోషులుగా నిర్ధారించి అదుపులోకి తీసుకున్నా మన్నారు. సమావేశంలో నూజివీడు రూరల్ ఎస్ఐ జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెంచాలి

ముదినేపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించి వెనుకబడిన విద్యార్థుల్లో సామర్థ్యం పెంచాలని ఉపాధ్యాయుడికి ఎంఈవో-2 కె.నరేష్ కుమార్ సూచించారు. పేరూరు ఎలిమెంటరీ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించాలన్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం అవసరమని గుర్తించి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. మధ్యాహ్న భోజనం అమలులో మెనూ పాటిం చాల్సిందేనని వంట ఏజెన్సీకి స్పష్టం చేస్తూ సూచనలు చేశారు.